తాంబూలాలిచ్చేశాం తన్నుకుచావండి!

- సర్దుబాటు చేయకుండానే వైసీపీ ఇంఛార్జుల ప్రకటన
- మెజారిటీ స్థానాల్లో వర్గ విభేదాలు... అసమ్మతులు

ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని మెజారిటీ నియోజకవర్గాల్లో తాంబూలాలిచ్చేశాం తన్నుకు చావండి... అన్నట్టుగా మారింది అధికార పార్టీ తీరు. ఆశావహుల మధ్య, వర్గాల నడుమ సర్దుబాటు చేయకుండానే, సయోధ్య కుదర్చకుండానే ఇంఛార్జులను ప్రకటించేసింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఇంఛార్జుల ప్రకటనపై పార్టీ నేతలు, శ్రేణుల్లో అసంతృప్తి, అసమ్మతి సద్దుమణగకపోగా మరింత ఎక్కువైంది. ఇంఛార్జుల ప్రకటనతో వర్గ విభేదాలు సర్దుకుంటాయని వైసీపీ అధిష్ఠానం వేసిన అంచనాలు దీంతో తలకిందులవుతు న్నాయి. కొన్ని స్థానాల్లో ఇంఛార్జుల స్వభావం సొంత పార్టీలోని వ్యతిరేక వర్గీయులతో అగాధం మరింత పెరిగిపోయేందుకు కారణమవుతోంది. వ్యతిరేకిస్తున్న వారిని కలుపుకునిపోయేందుకు ఏమాత్రం ప్రయత్నించకపోవడం లేదు. దీంతో విభేదిస్తున్న నేతల అహం దెబ్బతిని ఎన్నికల వేళ తీవ్ర పరిణామాలకు దారి తీస్తోంది.



తిరుపతి, ఆంధ్రజ్యోతి

వెంకటగిరిలో ఆలస్యంగా వ్యతిరేకుల ఇళ్ళకు

వెంకటగిరిలో ఏడాది కిందటే ఇంఛార్జిగా నియమితులైనప్పటికీ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి నియోజకవవర్గంలో పార్టీపై పూర్తిగా పట్టు రావడం లేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి సన్నిహితులని భావించిన నాయకులందరినీ రామ్‌కుమార్‌రెడ్డి దూరం పెట్టారనే ఆరోపణలున్నాయి. ఇపుడు ఆనం పార్టీని వీడిపోయి, రామ్‌కుమార్‌రెడ్డికి లైన్ క్లియర్ అయినా కూడా ఆనం సన్నిహితులతో ఆయన సయోధ్య కుదుర్చుకోలేదు. దూరంగా వున్న నాయకులతో ఎన్నికల్లో నష్టం కలుగుతుందని భావించిన ఆయన తల్లి, మాజీ మంత్రి రాజ్యలక్ష్మి నేరుగా రంగంలోకి దిగి కుమారుడికి దూరంగా వున్న నాయకులను బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. పలువురు నాయకుల ఇళ్లకు వెళ్ళడంతో పాటు మరికొందరిని తన ఇంటికి ఆహ్వానించి కుమారుడికి ఎన్నికల్లో సాయం చేయాలని అభ్యర్థిస్తున్నారు. ఆమె పట్ల వారికి గౌరవం వున్నప్పటికీ వారు సర్దుకోలేకపోతున్నారు. రామ్‌కుమార్‌రెడ్డి వెళ్ళకుండా ఇంట్లో కూర్చుని వుంటే తామెందుకు మద్దతివ్వాలన్న ప్రశ్న వారి నుంచీ ఎదురవుతోంది. మొదటగా పోటీ చేయనున్న అభ్యర్థి వెళ్ళి సహకారం కోరితే తర్వాత ఆయన తరపు ఎవరు వెళ్ళినా ఇబ్బంది వుండేది కాదు.అలా కాకుండా రామ్‌కుమార్‌రెడ్డి బాగా ఆలస్యంగా మేల్కొని ఇపుడు ఎన్నికలు ముంచుకొచ్చాక వ్యతిరేకుల ఇళ్ళకు వెళుతున్నారు. దీంతో పార్టీలోని ఆయన వ్యతిరేకవర్గం సర్దుకునేందుకు సుముఖంగా లేరని సమాచారం.

గూడూరు ఎమ్మెల్యేతో పార్లమెంటు పరిధిలో నష్టం

గూడూరులో సిట్టింగ్ ఎమ్మెల్యేని పక్కన పెట్టి కొత్త ఇంఛార్జిగా ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్‌ను వైసీపీ అధిష్ఠానం ప్రకటించేసింది. ఈ సందర్భంగా సిట్టింగ్ ఎమ్మెల్యే అభిప్రాయాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు.కనీసం ప్రత్యామ్నాయం కూడా సూచించలేదు. ఐదేళ్ళు ఎంపీగా, ఐదేళ్ళు ఎమ్మెల్యేగా తాను సేవలందించిన పార్టీ నుంచీ ఈ రకమైన ధోరణి ఎదురుకావడం వరప్రసాదరావు మనసును కలచివేసినట్టు సమాచారం. దీంతో ఆయన తన పదేళ్ళ రాజకీయ నేపథ్యాన్నే అర్హతగా, ప్రామాణికతగా తీసుకుని జనసేన పార్టీ నుంచీ తిరుపతి ఎంపీగా పోటీ చేసేందుకు యత్నిస్తున్నారు.ఆయన తిరుపతి పార్లమెంటు పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ సన్నిహితులతో, పరిచయస్తులతో కలుస్తున్నారు. వారి మద్దతు కోరుతున్నారు. ఆయన కార్యకలాపాలు తెలుస్తున్నా వైసీపీ అధిష్ఠానం ఆయనతో సర్దుబాటుకు యత్నించడం లేదు. ఇది వరప్రసాదరావును, ఆయన సన్నిహితులను మరింత రెచ్చగొడుతోంది. దీంతో ఆయన రెట్టించిన పట్టుదలతో చాపకింద నీరులా జనసేనలో తన అవకాశాలను మెరుగుపరుచుకునేందుకు యత్నిస్తున్నారు. నిస్సందేహంగా ఇవి వైసీపీకి తిరుపతి పార్లమెంటులో, ప్రత్యేకించి గూడూరు సెగ్మెంట్‌లో నష్టం చేకూర్చే పరిణామాలే.

జీడీనెల్లూరులో సయోధ్యకు ఫలించని యత్నాలు

డిప్యూటీ సీఎంగా, సీఎం జగన్‌కు సన్నిహితుడిగా పేరున్నప్పటికీ నారాయణస్వామి టికెట్ విషయంలో అధిష్ఠానం నుంచీ అమర్యాదకర అనుభవాన్ని ఎదుర్కొన్నారు. నియోజకవర్గంలో పలువురు సొంత పార్టీ నాయకులు, పీఏలుగా వ్యవహరించిన రక్త సంబంధీకులు కూడా ఎదురు తిరిగారు. దీంతో అధిష్ఠానం ఆయన్ను చిత్తూరు ఎంపీ స్థానానికి ఇంఛార్జిగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో చిత్తూరు ఎంపీని ఇంఛార్జిగా నియమించింది. వారం పదిరోజులకే మళ్ళీ నిర్ణయం మార్చుకుని వారిని వారివారి యధా స్థానాలకు తిరిగి ఇంఛార్జులుగా నియమించింది. తొలి ప్రకటనప్పుడు గానీ మలి ప్రకటనప్పుడు గానీ వర్గ విభేదాలు సర్దుబాటు చేసేందుకు అధిష్ఠానం యత్నించలేదు. నారాయణస్వామిని వ్యతిరేకిస్తున్నది ప్రధానంగా మాజీ ఎంపీ జ్ఞానేంద్రరెడ్డి. ఆయన కనుసన్నల్లోనే స్వామి వ్యతిరేకవర్గం కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. దీంతో జ్ఞానేంద్రరెడ్డితో సర్దుబాటు చేసుకునేందుకు స్వామి యత్నిస్తున్నారు. ఇటీవల సీఎం రాక సందర్భంగా రేణిగుంటలోని విమానాశ్రయంలో ఒకసారి, తర్వాత పెనుమూరులో వ్యవసాయ క్షేత్రంలో ఆయనతో మాట్లాడి సాయం చేయాలని అభ్యర్థించారు. అయితే క్షేత్ర స్థాయిలో చేతులు కలిపేందుకు వ్యతిరేకవర్గం అంగీకరించడం లేదు. దీంతో నాయకుల చుట్టూ తిరగడం కంటే టికెట్ ప్రకటించాక నేరుగా జనం వద్దకే వెళ్ళి బతిమాలుకుంటానని నారాయణస్వామి సన్నిహితుల వద్ద వ్యాఖ్యానిస్తున్నట్టు సమాచారం. ఈ పరిణామంతో ఇరువర్గాల మధ్య విభేదాలు మరింత ముదురుతున్నాయి.

సైలెంటైన ముగ్గురు ఎమ్మెల్యేలు

చిత్తూరు సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీనివాసులును పక్కకు తప్పించి ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డిని ఇంఛార్జిగా ప్రకటించిన ప్రారంభంలో అంతా బాగున్నట్టే అనిపించింది. గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల్లో ఎంచక్కా ఎమ్మెల్యేయే స్వయంగా అనుచరవర్గాలతో ఆత్మీయ సమావేశాలు పెట్టి విజయానందరెడ్డి గెలుపుకోసం సహకరించాలని కోరారు. అయితే రాజ్యసభ అభ్యర్థిత్వం విషయంలో అధిష్ఠానం నిర్ణయం మారిపోవడంతో ఒక్కసారిగా ఎమ్మెల్యే సైలెంట్ అయ్యారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు రెండింటికీ దూరమయ్యారు. రాజకీయంగా వేగంగా నిర్ణయాలు తీసుకుని విజయవంతంగా అమలు చేయడంలో సిద్ధహస్తుడైన ఎమ్మెల్యే శ్రీనివాసులు పైకి మౌనంగా వున్నట్టు కనిపించినా అంతర్గతంగా ప్రత్యామ్నాయం కోసం గట్టి ప్రయత్నాలే చేస్తుంటారన్న అనుమానాలు వైసీపీ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. పూతలపట్టులో కూడా సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబును పక్కన పెట్టి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్‌ను ఇంఛార్జిగా నియమించారు. బహిరంగంగానే మంత్రి పెద్దిరెడ్డిపై ఆరోపణలు చేసిన ఎంఎస్ బాబు తర్వాత పొరపాటైందని ప్రకటించి మౌనవ్రతం పాటిస్తున్నారు. మకాం బెంగుళూరుకు మార్చారు. వైసీపీ, ప్రభుత్వ కార్యక్రమాలు రెండింటికీ హాజరు కావడం లేదు. ఆయనకు మద్దతు పలికిన నాయకులు, అనుచరులు కూడా ఇంఛార్జితో కలవడం లేదు. ఎమ్మెల్యే తరహాలో పార్టీ కార్యకలాపాలకు దూరంగా వుంటున్నారు. వీరిని కలుపుకునిపోయేందుకు పార్టీ పరంగా కూడా ప్రయత్నాలు జరగడం లేదు. దీంతో రెండు వర్గాల నడుమ అంతరం అలానే వుండిపోయి రోజులు గడిచే కొద్దీ పెరుగుతోంది. మదనపల్లెలో సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్ బాషాను విస్మరించి నిషార్ అహ్మద్‌ను ఇంఛార్జిగా నియమించిన సంగతి తెలిసిందే. దీనిపై బహిరంగంగా ఒక్కమాట కూడా మాట్లాడకుండా ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెరమరుగయ్యారు. పార్టీ కార్యక్రమాలతో పాటు చివరికి అధికారిక కార్యక్రమాలకు కూడా దూరమయ్యారు. మకాం బెంగళూరుకు మార్చారు. ఎన్నికల్లో ఆయన చురుగ్గా పనిచేసేలా అధిష్ఠానం యత్నించడం లేదు. జిల్లా నేతలు సైతం ఆయన్ను పట్టించుకోవడం లేదు.

సత్యవేడు వైసీపీలో మరింత గందరగోళం

సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలాన్ని తిరుపతి లోక్‌సభకు ఇంఛార్జిగా బదిలీ చేసి ఆయన స్థానంలో తిరుపతి ఎంపీ గురుమూర్తిని సత్యవేడు ఇంచార్జిగా నియమించడంతో అంతర్గత పోరు రగులుకుని తారస్థాయికి చేరిన సంగతి తెలిసిందే. ఇపుడు ఆ నియోజకవర్గంలో అధికార పార్టీ మరింత గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఆదిమూలం తాను ఎంపీగా పోటీ చేయనని ప్రకటించడంతో పాటు టీడీపీలో చేరే క్రమంలో యువనేత నారా లోకేశ్‌ను కూడా కలిశారు. ఆదిమూలం తిరుగుబాటుతో తిరుపతి ఎంపీ గురుమూర్తిని తిరిగి తిరుపతి లోక్‌సభ ఇంఛార్జిగా నియమించిన అధిష్ఠానం సత్యవేడుకు మంత్రి పెద్దిరెడ్డి అనుచరుడైన నూకతోటి రాజేష్‌కుమార్‌ను ఇంఛార్జిగా ప్రకటించింది. మంత్రి పెద్దిరెడ్డి సత్యవేడు నియోజకవర్గ ముఖ్యులను తిరుపతిలో తన ఇంటికి పిలిపించుకుని రాజేష్‌ను పరిచయం చేశారు. ఆయన గెలుపుకోసం కృషి చేయాలని నిర్దేశించారు. మంత్రి ఎదురుగా వినయంగా చేతులు కట్టుకుని మరీ తలలూపి బయటకు వచ్చిన నాయకులు నియోజకవర్గం చేరగానే స్థానికులకే టికెట్ ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తున్నారు. కేవీబీపురం మండల నేత డేవిడ్ తన మద్దతుదారులను వెంటబెట్టుకుని రాజేష్ సమక్షంలోనే ఎంపీ మిధున్‌రెడ్డిని కలసి టికెట్ కోరడం కలకలం రేపింది. బయటి వారిని తమపై రుద్దకుండా స్థానికులకే టికెట్ కేటాయించాలన్న డిమాండ్ ఊపందుకుంటున్నందున నియోజకవర్గంలో గందరగోళం నెలకొంటోంది. దీనివల్ల అభ్యర్థి విషయంలో మార్పులుంటాయన్న అంచనాలు కూడా మొదలవుతున్నాయి.

నగరి, సూళ్ళూరుపేటల్లో కుదరని సయోధ్య

నగరి, సూళ్ళూరుపేట నియోజకవర్గాల్లో వైసీపీ అధిష్ఠానం ఇంఛార్జులను మార్చకపోయినప్పటికీ సిట్టింగ్ ఎమ్మెల్యేల వర్గాలకు, వ్యతిరేక వర్గాలకు నడుమ సయోధ్య కుదరడం లేదు. నగరిలో మంత్రి రోజాయే తిరిగి పోటీ చేస్తారా లేక కొత్త అభ్యర్థి వస్తారా అన్నది తేలడం లేదు. రోజా సైతం బింకంగానే తప్ప ధీమాగా తానే పోటీ చేస్తానని చెప్పలేకపోతున్నారు. అదే సమయంలో ఆమెను వ్యతిరేకిస్తున్న పార్టీ నేతలతో మాట్లాడి రాజీ కుదిర్చే ప్రయత్నం ఏ స్థాయిలోనూ జరగడం లేదు. జిల్లాపై పట్టున్న ఓ మంత్రి నగరిలో జోక్యం చేసుకుంటున్నారని గతంలో అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో ఇపుడా మంత్రి తానెందుకు పట్టించుకోవాలని ప్రశ్నిస్తున్నట్టు సమాచారం. దీంతో వ్యతిరేకవర్గాన్ని కలుపుకుని పోయే ప్రయత్నాలకు స్వస్తి పలికిన రోజా వారు కలిగించే నష్టాన్ని పూడ్చుకునేందుకు ప్రత్యామ్నాయం అన్వేషిస్తున్నారు. ఆ క్రమంలో రాజకీయాలకు దూరంగా వున్న వర్గాలను, ముఖ్యులను కూడా కలసి మద్దతు కోరుతున్నారు. ఆమె తీరు సొంత పార్టీలో వ్యతిరేక వర్గాన్ని మరింతగా రెచ్చగొడుతోంది. వారి మధ్య అగాధం మరింత పెరుగుతోంది. సూళ్ళూరుపేటలో సైతం టికెట్ విషయంలో సంజీవయ్యకు అధిష్ఠానం హామీ ఇచ్చినట్టు ప్రచారమవుతోంది. అయినా పార్టీలో వ్యతిరేకవర్గం రాజీ పడడంలేదు. సంజీవయ్యకు టికెట్ ఇస్తే ఓడిస్తామన్న శపథానికి కట్టుబడి అధిష్ఠానం ప్రకటన కోసం వేచి చూస్తున్నట్టు సమాచారం. అవసరమైతే టీడీపీ అభ్యర్థికి బహిరంగంగా కొందరు, లోపాయికారీగా కొందరు సహకరించే పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ కూడా ఎమ్మెల్యేకి, వ్యతిరేక వర్గానికి నడుమ విబేధాలు తొలగించి దగ్గర చేసే ప్రయత్నం ఎవరూ చేయడం లేదు. మొత్తానికి కీలకమైన ఎన్నికల వేళ ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో 17 అసెంబ్లీ నియోజకవర్గాలకు గానూ తొమ్మిది నియోజకవర్గాల్లో అధికార పార్టీ పరిస్థితి అంతర్గత కలహాలతో దారుణంగా వుంది.

ఐఐటీ, ఐసర్, ట్రిపుల్ ఐటీ
జాతికి అంకితం

ఏర్పేడు, ఫిబ్రవరి 20 : తిరుపతి ఐఐటీ, ఐసర్, శ్రీసిటీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లు జాతికి అంకితమయ్యాయి.మంగళవారం మధ్యాహ్నం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జమ్మూ రాష్ట్రం నుంచి ఈ ఉన్నత విద్యాసంస్థలను వర్చువల్‌గా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఐఐటీ, ఐసర్, ఐఐఎం తదితర 36 జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థలను ప్రధాని ప్రారంభించగా అందులో జిల్లాకు చెందిన మూడు సంస్థలు వున్నాయి. ఏర్పేడు మండలంలోని ఐఐటీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రధాని మోదీ ప్రసంగాన్ని భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ఆహూతులకు ప్రదర్శించారు.గవర్నర్ అబ్దుల్‌నజీర్, ముఖ్యమంత్రి జగన్ విజయవాడ నుంచీ వర్చువల్‌గా పాల్గొనగా ఐఐటీ క్యాంపస్‌లో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణ,పీఆర్వో చమన్ మెహతా, ప్రోగ్రాం ఆఫీసర్ మహేష్‌కుమార్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఐసర్‌లో కార్యక్రమానికి ఎంపీ గురుమూర్తి, కలెక్టర్ లక్ష్మీశా,ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య హాజరయ్యారు. రాష్ట్ర విభజన చట్టం కింద కేంద్రం ఏపీకి మంజూరు చేసిన ఐఐటీ, ఐసర్‌లను అప్పటి సీఎం చంద్రబాబు తిరుపతి జిల్లాలో ఏర్పాటు చేయించిన సంగతి తెలిసిందే. వీటిలో ఐఐటీ 2014లో తిరుపతిలోని చదలవాడ కళాశాలల ప్రాంగణంలోని అద్దె భవనాల్లో ప్రారంభం కాగా 2015 మార్చిలో రాష్ట్రప్రభుత్వం ఏర్పేడు మండలం మేర్లపాక పంచాయతీలో 548 ఎకరాలు కేటాయించింది. భవనాల నిర్మాణానికి రూ. 863 కోట్లు, విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి కోసం రూ. 230 కోట్లు చొప్పున కేంద్రం సుమారు రూ. 1093 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికి తొలిదశ నిర్మాణాలు పూర్తి చేసుకోవడంతో ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రస్తుతం ఐఐటీలో 1550 మంది విద్యార్థులుండగా అందులో 900 మంది బీటెక్ విద్యార్థులు, మిగిలిన వారు పీజీ కోర్సులు చేస్తున్నారు. ఇక ఐసర్ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి) విషయానికొస్తే 2015లో తిరుపతి నగరం కరకంబాడి రోడ్డులోని మంగళం వద్ద తాత్కాలిక భవనాల్లో ఏర్పాటైంది. 2016లో ఏర్పేడు మండలంలో రాష్ట్ర ప్రభుత్వం 255 ఎకరాల భూమి కేటాయించింది. కేంద్రం విడుదల చేసిన రూ. 1437.91 కోట్లతో ఐసర్ తొలి దశ నిర్మాణాలు పూర్తి చేసుకుంది. 35 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ సంస్థలో ఇపుడు 1100 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక ట్రిపుల్ ఐటీ సత్యవేడులో శ్రీసిటీ సెజ్ ఆధ్వర్యంలో నడుస్తోంది.



అక్రమ గ్రావెల్ తవ్వకాలపై సర్వే

- అటవీ, రెవిన్యూ భూములకు హద్దుల గుర్తింపు



శిరసనంబేడులో సర్వే చేపడుతున్న అధికారులు

పెళ్లకూరు, ఫిబ్రవరి 20:పెళ్లకూరు మండలంలోని రోసనూరు, శిరసనంబేడుల్లో జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలపై మంగళవారం రెవిన్యూ, అటవీ శాఖల ఉమ్మడి సర్వే జరిగింది.గ్రావెల్ తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని ఇటీవల హైకోర్టు స్టే ఇచ్చింది. గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న భూములను ఏ శాఖకు చెందినవో గుర్తించడంతో పాటు నిబంధనలు పాటించారా లేదా అన్న దానిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆయా శాఖలను హైకోర్టు ఆదేశించింది. దీంతో ఈ రెండు గ్రామాలలోని కొండ ప్రాంతాల్లో మంగళవారం మైనింగ్ ఏడీ డీవీ రంగారావు, విజిలెన్స్ ఏడీ బాలాజీనాయక్, అటవీశాఖ అధికారులతో పాటు తహసీల్దార్ కేవీ ఆర్వీ ప్రసాదరావు, ఆర్ఐ సంతోషిబాయి, వీఆర్వో రవిచంద్ర సర్వే నిర్వహించారు. ముందుగా అటవీ, రెవిన్యూ శాఖ భూములను గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు. బుధవారం ఏ శాఖకు సంబంధించి ఎన్ని ఎకరాల భూముల్లో గ్రావెల్ తవ్వకాలు జరిగాయి,ఎంత మేరకు తవ్వకాలు చేపట్టారో అనే దానిపై సర్వే చేపట్టనున్నట్లు తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు.

మీ ఆశలు వమ్ము కానివ్వం

త్వరలోనే చంద్రన్న రాజ్యం వస్తుంది
పేదల ఆకలి తీర్చడానికే అన్న క్యాంటీన్లు
కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి



కుప్పం/గుడుపల్లె, ఫిబ్రవరి 20: 'మీ నాయకుడిపై చాలా నమ్మకం పెట్టుకున్నారు మీరంతా. ఆ నమ్మకం ఎప్పటికీ వమ్ము కానివ్వం. మీ కష్టాలు తీరే రోజు ఇంకా ఎంతో దూరంలో లేదు. త్వరలోనే మీరు కోరుకున్న చంద్రన్న రాజ్యం వస్తుంది' అని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ ఎండీ నారా భువనేశ్వరి అన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం, కుప్పంలో పర్యటించారు. చంద్రబాబు జైలుకెళ్లిన సమయంలో మనోవేదనతో మృతి చెందిన గుడుపల్లె మండలం కొడతనపల్లెకు చెందిన వి.వెంకటేశ్, , యామగానిపల్లెలో జి.శ్రీనివాసులు కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చెక్కు అందించారు. అనంతరం రైల్వే స్టేషన్ సర్కిల్ సమీపంలో అన్న క్యాంటీన్ ప్రారంభించి మాట్లాడారు. 'చంద్రబాబు జైల్లో ఉన్న 53 రోజులూ మీరు నిద్రాహారాలు మాని ఆయనకోసం తపించారు. ఆయన జైలు నుంచి వెలుపలకు రావాలని, ఆయనమీద పెట్టిన తప్పుడు కేసులు మాఫీ కావాలని ఎన్నో దేవుళ్లకు మొక్కుకున్నారు. ప్రభుత్వం ఎన్ని అరాచకాలకు పాల్పడినా నిరసనలు చేసి, మీ నాయకుడికోసం నిలబడ్డారు. నాయకుడిపై నమ్మకంతో ధైర్యంగా ఉన్నారు. పార్టీ శ్రేణులన్నీ మా కుటుంబంపై చాలా నమ్మకం పెట్టుకున్నారు. మీ భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటాం' అంటూ భువనేశ్వరి హామీ ఇచ్చారు.

పేదల ఆకలి తీర్చడం ఓర్వలేక..

'పేదల కోసం అన్నగారు కిలో రెండు రూపాయల బియ్యం తీసుకొచ్చారు. పేదల ఆకలి తీర్చాలని చంద్రబాబు ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో 364 అన్న క్యాంటీన్లు ప్రారంభిచారు. ఏటా 7.50 కోట్ల మంది భోజనం చేస్తూ వచ్చారు. ఇలా పేదల ఆకలి తీర్చుతుండడం ఓర్వలేకే ప్రభుత్వం అన్న క్యాంటీన్లను నిలిపేసింది. పేదల కడుపు కొట్టింది. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలే అక్కడక్కడా సొంతంగా అన్న క్యాంటీన్లు తెరిచి పేదలకు అన్నదానం మొదలు పెట్టారు. ఇలా ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 150 అన్న క్యాంటీన్లు నడుస్తున్నాయి. మంగళగిరిలో నారా లోకేశ్ నాలుగు క్యాంటీన్లు నడుపుతున్నారు. కుప్పంలో ఒక్కటే ఉంది. ఇప్పుడు కుప్పంతో పాటు గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పంలో ఒక్కోటి చొప్పున మొత్తం మూడు క్యాంటీన్లు ప్రారంభిస్తున్నాం. ఇవి పూర్తిగా మా కుటుంబ ఆధ్వర్యంలో నడుస్తాయి' అని భువనేశ్వరి చెప్పారు. అనంతరం ఆమె మల్లప్పకొండమీదకు వెళ్లి మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆపైన కుప్పం పట్టణ పరిధిలోని చర్చిలో ప్రార్థనలు జరిపారు. అనంతరం కుప్పం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రాత్రి బస చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోజకర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

నేటి పర్యటన ఇలా..

శాంతిపురం మండలం కడపల్లె వద్ద నిర్మాణంలో ఉన్న సొంతింటిని ఉదయం 10గంటలకు పరిశీలిస్తారు. 10.10 గంటలకు శాంతిపురం పాత గ్రామీణ బ్యాంకు క్రాస్‌లో మహిళలతో 'ఆడబిడ్డలకు ఆర్థిక స్వేచ్ఛ' అంశంపై ముఖాముఖి నిర్వహిస్తారు. 11.20 గంటలకు ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో,12.20 గంటలకు రామకుప్పం పోలీసు స్టేషన్ సర్కిల్ వద్ద అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నారు.వి.కోట మండలం విబూదిఎల్లాగరం గ్రామం వద్ద మధ్యాహ్నం 1.10 గంటలకు భోంచేస్తారు. తర్వాత నారా భువనేశ్వరి పెద్దపంజాణి మండలం శివాడి గ్రామానికి చేరుకుని కనకరాజు, కత్తార్లపల్లెలో శంకరప్ప కుటుంబాలను పరామర్శిస్తారు.తరువాత పుంగనూరు మండలం ఎన్ఎస్‌పేటకు చెందిన పద్మావతమ్మ, చెలిమిగడ్డకు చెందిన జయమ్మ, ఒంటిమిట్టకు చెందిన శ్రీనివాసులు నాయుడు కుటుంబీకులను బుధవారం సాయంత్రం భువనేశ్వరి పరామర్శిస్తారు. అనంతరం మదనపల్లె చేరుకుని అక్కడే రాత్రి బస చేస్తారు.

ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా హరి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20: ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన మిద్దెల హరి నియమితులయ్యారు.గతంలో ఆప్కో డైరెక్టర్‌గా, శ్రీకాళహస్తి పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్‌గా హరి పనిచేశారు. ఈ సందర్భంగా హరికి పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

28 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్, జేఈవో

చంద్రగిరి, ఫిబ్రవరి 20: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 28 నుంచి మార్చి 8వ తేదీ వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాలు సందర్భంగా ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు రాత్రి 7 నుంచి 8 గంటల వరకు స్వామివారి వాహన సేవలు నిర్వహిస్తారు. గరుడసేవ మాత్రం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 22వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఎఫ్ఏసీఏవో బాలాజీ, సీఏవో శేషశైలేంద్ర, చీఫ్ పీఆర్వో డాక్టర్ రవి, ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, రవాణా జీఎం శేషారెడ్డి, డిప్యూటీ ఈవో శివప్రసాద్, ఆలయ అర్చకులు శేషాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

మార్చి 2 నుంచి ముక్కోటి ఉత్సవాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 20: తొండవాడ స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మార్చి 2 నుంచి 10వ తేదీ వరకు మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి తెలిపారు. ఉత్సవాలలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కాలగలరని ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి కోరారు.

పౌల్ట్రీ ఫారమ్‌ల తనిఖీ



మిట్టపాళెం వద్ద పౌల్ట్రీని తనిఖీ చేస్తున్న వెటర్నరీ వైద్యులు

చంద్రగిరి, ఫిబ్రవరి 20: చంద్రగిరి మండలంలోని భీమవరం, మిట్టపాళెం తదితర గ్రామాల్లో మంగళవారం నారావారిపల్లె వెటర్నరీ సర్జన్ డాక్టర్ వంశీ, చంద్రగిరి ఏడీ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పెరటి కోళ్లు, పౌల్ట్రీ ఫారంలను తనిఖీ చేశారు. కోళ్ల ఆరోగ్య స్థితిగతులను సమీక్షించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఎక్కడా బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని నిర్ధారించారు. అనంతరం విజ్ఞానబడి కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో బర్డ్ ఫ్లూ వ్యాధిపై అవగాహన కల్పించారు. చికెన్, కోడి గుడ్లను ప్రజలు నిరభ్యంతరంగా తినవచ్చునని పేర్కొన్నారు.

పాకాల: మండలంలో ఎక్కడా బర్డ్ ఫ్లూ లేదని ప్రజలు చికెన్, కోడిగుడ్లు నిరభ్యంతరంగా తినవచ్చని దామలచెరువు పశువైద్యాధికారి జానకమ్మ తెలియజేశారు. మండలంలోని నన్నూరివారిపల్లె, ఉప్పువంక, వెంట్రామాపురం గ్రామాల్లోని పౌల్ట్రీ ఫారమ్‌లను పశువైద్యాధికారులు డాక్టర్ జానకమ్మ, డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ మోహన కుమారి మంగళవారం తనిఖీ చేశారు. కోళ్ల ఆరోగ్యాన్ని పరీక్షించారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాయని, బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవని నిర్ధారించారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



ఎర్రావారిపాళెం, ఫిబ్రవరి, 20 : డీఏ బకాయిలు చెల్లించాలని ఎర్రావారిపాళెం మండలంలోని ఉపాధ్యాయులు మంగళవారం నిరసన తెలియజేశారు. రెండో రోజు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి మండల కేంద్రంలో నిరసన తెలిపారు. వెంటనే ఐఆర్ 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

మళ్లీ వైసీపీదే విజయం: తుడా చైర్మన్



ప్రసంగిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 20: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో మళ్లీ వైసీపీ అధికారంలోకి వచ్చి తీరుతుందని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. తిరుపతి రూరల్ మండలంలోని పద్మావతిపురం, శ్రీనివాసపురం, సాయినగర్, కేసీపేట, వేదాంతపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు.

రాయలచెరువుపేటలో ఉపాధి గ్రామసభ



రామచంద్రాపురం, ఫిబ్రవరి 20: రాయలచెరువుపేటలో మంగళవారం సామాజిక తనిఖీ గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా 2023, 24 సంవత్సరాలకు సంబంధించి రాయలచెరువుపేట గ్రామంలో 48 పనులకు రూ.54లక్షలు ఖర్చుచేశారు. దీనిపై ఉపాధి సామాజిక తనిఖీ బృందం వారం రోజుల పాటు పనులు తనిఖీ చేసింది. గ్రామసభలో పనుల వివరాలను బృందం వెల్లడించింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మురగయ్య, జేఈ మమత, టీఏ ఆరోగ్య మేరీ, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

తిరుచానూరు ఆలయ ఏఈఎస్వోగా సతీష్‌కుమార్



తిరుచానూరు, ఫిబ్రవరి 20: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ ఏఈఎస్వోగా వై.సతీష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శైలేంద్రబాబు బదిలీపై తిరుమల సెక్టార్-3కి వెళ్లారు. అమ్మవారి సన్నిధిలో బాధ్యతలు స్వీకరించడం అదృష్టంగా భావిస్తున్నానని సతీష్ పేర్కొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 20: జిల్లా రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఇన్‌స్పెక్షన్ బంగ్లాలో 38 ఉద్యోగాలకు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. వాచ్‌మెన్-11, ఆఫీస్ సబార్డినేట్-14, శానిటరీ వర్కర్స్-13 పోస్టులు ఉన్నాయని వివరించారు. ఈనెల 27వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు తిరుపతిలోని జిల్లా రహదారులు, భవనాల ఇంజనీర్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. వివరాలకు tirupati.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

రేపు కవలల దినోత్సవం

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 20: కవలల దినోత్సవాన్ని గురువారం యశోదనగర్‌లోని వేమనవిజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటలు, సింగింగ్, డ్యాన్స్, ర్యాంప్‌వాక్ వంటి పోటీలను కవలలకు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేయనున్నారు. వివరాలకు 89780 17547 నెంబరుకు ఫోన్ చేయాలని నిర్వాహకులు హేమవతి, హేమలత కోరారు.

క్రీడామైదానంపై టీటీడీ పునరాలోచించాలి

ఎస్వీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 20: తిరుపతి ఎస్వీ హైస్కూల్ క్రీడా మైదానంపై టీటీడీ పునరాలోచించాలని మంగళవారం సాయంత్రం ఈవో ధర్మారెడ్డికి పూర్వ విద్యార్థుల సంఘం వినతిపత్రం సమర్పించింది. ఈవో మాట్లాడుతూ.. క్రీడామైదానంలో కొంతప్రదేశంలో మాత్రమే నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. ఎంత శాతం మేరకు కట్టడాలు ఉంటాయో కొలతలతో వివరణ ఇవ్వాలని చీఫ్ ఇంజనీర్‌ని ఆదేశించారు. ఇదివరకులాగే విద్యార్థులకు ఆటస్థలంగా కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఖాసీం, వీర మోహన్, దేవరాజులు, శ్రీనివాసులు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

● స్ట్రాంగ్ రూమ్‌లు సిద్ధం: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 20: జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్‌లూ సిద్ధంగా ఉన్నాయన్నారు. సార్వత్రిక ఎన్నికలపై కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం రాజకీయ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. 2023 ఏప్రిల్ 15 నుంచి ఈ ఏడాది జనవరి 22వ తేదీనాటికి 6, 7, 8 ఫారాలకు సంబంధించి 14,243 పెండింగ్ ఉన్నాయని తెలిపారు. అందులో ఫారం-6కి సంబంధించి 6,642, 6ఏకు 20, ఫారం-7కి 4,648, ఫారం-8కి 2,933 పెండింగ్‌లో ఉన్నా వాటిని వెంటనే పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ఫారం-9, 10, 11కి సంబంధించి టెక్నికల్ సమస్య ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచలకిషోర్, ఈఆర్వోలు కోదండరామిరెడ్డి, చంద్రముని, అదితిసింగ్, రాజకీయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

బర్డ్‌ఫ్లూ వ్యాధిపై ఆందోళన వద్దు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 20: 'జిల్లాలో బర్డ్‌ఫ్లూ వ్యాధిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మాంసప్రియులు చికెన్, కోడిగుడ్లను నిరభ్యంతరంగా తినవచ్చు' అని జిల్లా పశుసంవర్థక అధికారి రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం రామచంద్రాపురం, వడమాలపేట, తిరుపతిరూరల్, రేణిగుంట, పుత్తూరు మండలాల్లో పర్యటించి 18 పౌల్ట్రీ ఫారాలను తనిఖీ చేసి.. కోళ్ల ఆరోగ్య స్థితిగతులను సమీక్షించామని తెలిపారు. బర్డ్ ఫ్లూ లక్షణాలు కనిపించలేదని నిర్ధారించారు. ఇప్పటివరకు కోళ్ల నుంచి మనుషులకు ఎలాంటి వ్యాధి సంక్రమించలేదని, వదంతులు నమ్మొదని, ప్రచారం చేయవద్దని కోరారు.

అవకతవకలకు కారణమైన వారిపై కేసులు నమోదు చేయాలి: టీడీపీ

తుది ఓటర్ల జాబితా ప్రచురణకు ముందే అవకతవకలకు కారణమైన వారిపై కేసులు నమోదు చేయాలని చంద్రగిరి టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. చంద్రగిరి నియోజకవర్గంలో డెత్ ఓట్లు, డబుల్ ఎంట్రీలు, జీరో డోర్ నెంబర్ల ఓట్లు తొలగించలేదన్నారు. టీడీపీ సానుభూతి పరుల ఓట్లను మాత్రం గంపగుత్తగా తొలగించారని చెప్పారు. పరిశీలించి, ఎన్నికల ప్రక్రియ శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

టీటీడీ పనితీరు బాగుంది

హోం శాఖ పార్లమెంటరీ వ్యవహారాల కమిటీ చైర్మన్



తిరుమల ఆలయంలో హోం శాఖ పార్లమెంటరీ వ్యవహారాల కమిటీతో టీటీడీ ఈవో ధర్మారెడ్డి

తిరుమల, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి):టీటీడీ పనితీరు బాగుందని హోం శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ బ్రిజ్‌లాల్ అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం ఉదయం ఈ కమిటీ దర్శించుకుంది. అనంతరం టీటీడీ ఈవో ధర్మారెడ్డి, వివిధ విభాగాల అధికారులు, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఎస్పీ మలిక గర్గ్‌తో కమిటీ సమావేశమైంది.టీటీడీ చేపడుతున్న సామాజిక, ధార్మిక, సంక్షేమ కార్యకలాపాలను 40 నిమిషాల ఆడియో విజువల్స్ ప్రజంటేషన్ ద్వారా ఈవో వివరించారు. అనంతరం కమిటీ చైర్మన్ బ్రిజ్‌లాల్ మీడియాతో మాట్లాడుతూ తిరుమల పరిశుభ్రంగా వుందన్నారు.భక్తులకు దర్శనం, అన్నప్రసాదాలు, గదులు తదితర సౌకర్యాలను చక్కగా కల్పిస్తున్నారన్నారు.భద్రత విషయంలోనూ టీటీడీ సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు.ఇదే తరహాలో అన్ని దేవాలయాలనూ సందర్శిస్తామన్నారు. త్వరలో అయోధ్యకు వెళతామన్నారు.కమిటీ సభ్యులు బిప్లవ్ కుమార్ దేవ్, నీరజ్ శేఖర్, దిలీప్ ఘోష్, దులాల్ చంద్ర గోస్వామి, రాజా అమరేశ్వర నాయక్, సత్యపాల్ సింగ్, నిషికాంత్ దూబే తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ట్రస్టులకు రూ.43 లక్షల విరాళం

టీటీడీ ట్రస్టులకు మంగళవారం రూ.43 లక్షలు విరాళంగా అందాయి. బెంగళూరుకు చెందిన యాక్సిస్ హెల్త్ కేర్ సంస్థ వ్యవస్థాపకులు వర్ధమాన్ జైన్ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.33 లక్షలు, ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.10లక్షల విరాళాన్ని టీటీడీ ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

433 మందికి 'కల్యాణమస్తు, షాదీ తోఫా'

రూ.3.16కోట్లు జమ: కలెక్టర్



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 20: జిల్లాలో 'వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీ తోఫా' కింద గత ఏడాది అక్టోబరు నుంచి డిసెంబరు వరకు వివాహం చేసుకున్న 433మంది లబ్ధిదారులకు రూ.3.16కోట్లను జమ చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం జగన్ బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేసే కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఐదు విడతల్లో కలిపి మొత్తం 2,035మంది లబ్ధిదారులకు రూ.16.86 కోట్లను వారిబ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు వివరించారు. అనంతరం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష, ఎమ్మెల్యే సిపాయి సుబ్రహ్మణ్యం, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, సాంఘిక సంక్షేమ శాఖ, సాధికారత అధికారి చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లోని పరిశ్రమలను త్వరగా ప్రారంభించాలి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 20: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పరిశ్రమలను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో పరిశ్రమలశాఖ, ఏపీఐఐసీ తిరుపతి స్పెషల్ జోన్‌లో పరిశ్రమలకు సంబంధించి అంశాలపై సమీక్షించారు. పీఎం విశ్వకర్మ అప్లికేషన్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అధికారులు ప్రతాప్ రెడ్డి, చంద్రశేఖర్, రామకృష్ణారెడ్డి, జ్యోతి, రాజశేఖర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూజీ హాస్టల్లో మత్తు పదార్థాలు లేవు

ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 20: తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల యూజీ హాస్టల్లో పోలీసులతో కలిసి చేసిన తనిఖీల్లో ఎటువంటి మత్తు పదార్థాలు లభ్యం కాలేదని ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య గొడవలు జరిగాయని, ఈ నేపథ్యంలో గతంలోలా అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఉండటానికి హాస్టల్లో తనిఖీలు నిర్వహించిన మాట వాస్తవమేనని పేర్కొన్నారు. తనిఖీలు నిర్వహించి, విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వడానికి పోలీసుల సాయం తీసుకున్నామని వివరించారు. ఈ తనిఖీల్లో బయటి నుంచి విద్యార్థులు తెచ్చుకున్న ఆహార పదార్థాలను మాత్రమే గుర్తించామన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు



దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

తిరుపతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం పలు దుకాణాలు, హోటళ్లు, వీధి వ్యాపారుల వద్ద తనిఖీలు నిర్వహించారు. 122 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు, నాన్ ఓవెన్ క్యారీ బ్యాగులను సీజ్ చేశారు. దాదాపు రూ.60వేల పెనాల్టీ వేశారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు పదేపదే వినియోగిస్తే రూ.10వేల వరకు అపరాధ రుసుం వేయడమే కాకుండా ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

తెప్పలపై శ్రీకృష్ణస్వామి విహారం





తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 20: గోవిందరాజ స్వామి తెప్పోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ఆండాళ్ సమేత శ్రీకృష్ణస్వామి తెప్పలపై ఆలయ పుష్కరిణిలో విహరించారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో భజనలు, హరికథ, సంకీర్తనాగానం భక్తులను అలరించాయి. రాత్రి 8.30 గంటలకు ఆలయ మాడవీధుల్లో స్వామివారి ఊరేగింపు జరిగింది. అంతకుముందు ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు ఆలయంలోని కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. బుధవారం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవమూర్తులు తెప్పలపై విహరించనున్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల చినజీయరు స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

24న శారదా నిలయం ప్రారంభం

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 20: తిరుపతిలోని శ్రీరామకృష్ణ ఆశ్రమం ఆవరణలో నూతనంగా నిర్మించిన సాధునివాసం శ్రీశారదానిలయం 24వ తేదీన ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద ఒక ప్రకటనలో తెలిపారు.

తిరుపతి ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరం చేయండి : టీటీడీ చైర్మన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 20: తిరుపతి ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరం చేయాలని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సూచించారు. ఈ అంశంపై పద్మావతి గెస్ట్ హౌస్‌లో మంగళవారం ఆయన అధికారులతో సమీక్షించారు. తిరుమల శ్రీవారి పాద పీఠ నగరంగా వెలసిన మన తిరుపతి పుట్టిన రోజును అందరం కలిసి వైభవంగా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో భాగంగా గోవిందరాజస్వామి వారి ఆలయం నుంచి ఈనెల 24వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు ఊరేగింపు ప్రారంభం కానుందన్నారు. పోలీసులతో సమన్వయం చేసుకుని ట్రాఫిక్ సమస్య రాకుండా చూడాలన్నారు. కళాకారులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. జేఈవో వీరబ్రహ్మం, ఎఫ్ఏసీఏవో బాలాజి, సీఏవో శేషశైలేంద్ర, చీఫ్ పీఆర్వో డాక్టర్ తలారి రవి, ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రాం అధికారి రాజగోపాల్, రవాణా జీఎం శేషారెడ్డి, డిప్యూటీ ఈవో శివప్రసాద్, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఉమా మధుబాల పాల్గొన్నారు.

సీపీఐ నేతల గృహ నిర్బంధం

తిరుచానూరు, ఫిబ్రవరి 20: తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకంలో ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు పంచుతామని పిలుపునిచ్చిన నేపథ్యంలో సీపీఐ నాయకులను మంగళవారం ఉదయం పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ మాట్లాడుతూ ఇల్లులేని నిరుపేదలకు సీపీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిలో స్థలాలు పంచుతామని పిలుపునిస్తే అక్రమ అరెస్టులు చేయడం ఉద్యమం మరింత బలపడుతుందన్నారు. ఎన్ని అరెస్టులు చేసినా కుంట్రపాకం వద్ద ప్రభుత్వ భూముల్లో ఇల్లులేని పేదలకు స్థలాలు పంచుతామన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులను పబ్లిక్ పరీక్షలకు కూడా వెళ్లనీవకుండా దౌర్జన్యంగా పోలీస్‌స్టేషన్‌కు తరలించడం ఖండిస్తున్నామన్నారు. సీపీఐ నాయకులు రాధాకృష్ణ, ఎన్‌డి రవి, ఏఐఎస్ఎఫ్ నాయకులు బండి చలపతి, ఉదయ్‌కుమార్‌లను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ అరెస్టులను ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ఖండించారు.

నేడు కేఏ పాల్ పిల్ విచారణ

▸▸ వాదించేందుకు న్యాయవాదిని నియమించుకోవాలని హైకోర్టుసూచన

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ తాను దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)పై అత్యవసరంగా విచారణ జరపాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టును అభ్యర్థించారు. రాజకీయ కారణాలతో ఆ పిల్ విచారణకు రాకుండా చేశారని మంగళవారం ఆయన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రాబోతోందని తెలిపారు. పాల్ అభ్యర్థనపై స్పందించిన ధర్మాసనం బుధవారం విచారణ జరుపుతామని తెలిపింది. అయితే, మధ్యాహ్నం భోజన విరామ సమయానికి ముందు కేఏ పాల్ మరోసారి సీజే నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు వచ్చారు. తన వ్యాజ్యంలో తానే స్వయంగా వాదనలు వినిపించేందుకు రిజిస్ట్రీ అనుమతించడంలేదన్నారు. గతంలో తాను తెలంగాణ హైకోర్టు, సుప్రీంకోర్టులో వాదనలు వినిపించానని తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం కేసులో వాదనలు వినిపించేందుకు న్యాయవాదిని నియమించుకోవాలని పాల్‌కు సూచించింది.

వైసీపీ దాడిలో చూపే పోయింది

● దివ్యాంగుడైన కుమారుడితో ఇంటికే వితంతువు పరిమితం ● టేకుమందలో ఆలస్యంగా వెలుగు చూసిన దారుణం



హంసవేణికి ధైర్యం చెబుతున్న టీడీపీ నేతలు



చిత్తూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడితో మాట్లాడటమే తప్పయింది. గ్రామంలో నీటి సమస్య ఉందని చెప్పడమే ఆమె నేరమైంది. దీన్ని మనసులో ఉంచుకుని అధికార పార్టీ నాయకుల ఇళ్లల్లోని మహిళలు గొడవకు దిగేవారు. చివరకు వీరి దాడిలో ఆ మహిళ రెండు కళ్లు దెబ్బతిని.. చూపే పోయింది. బంగారుపాళ్యం మండలం టేకుమందలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి.

బంగారుపాళ్యం మండలం టేకుమందకు చెందిన హంసవేణి భర్త రఘుపతి మూడేళ్ల కిందట మరణించారు. ఒక్కగానొక్క 16 ఏళ్ల కుమారుడు సుమన్ దివ్యాంగుడు. రెండు పాడి ఆవులతో పాటు కూలి పనులు చేసుకుంటూ ఆమె జీవనం సాగిస్తున్నారు. ఆ గ్రామంలో నెల కిందట పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఊరి బయటి చేతి పంపు నుంచి నీళ్లను తెచ్చుకుంటున్న హంసవేణిని ఆయన పలకరించారు. గ్రామంలో నీటి సమస్య ఉందని ఆమె చెప్పారు. 'టేకుమందలో తాగునీటి సమస్య ఉంటే సీఎం జగన్‌కు పట్టదా?' అంటూ ఆయన మీడియా సమావేశంలో ప్రశ్నించారు. హంసవేణి ఉంటున్న వీధిలో వైసీపీ సానుభూతిపరులు ఎక్కువ. ఈ విషయాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. హంసవేణి ఆవుల్ని కట్టేసేచోట వీరు మలవిసర్జన చేసి ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టేవారు. ఇదేంటని ఆమె ప్రశ్నించగా గొడవకు దిగేవారు. ఈ నెల 10వ తేది సాయంత్రం ఆ గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరుల ఇంట్లో మహిళలు హరియమ్మ, వెంకటమ్మ, కళమ్మ, తులసమ్మ, గీత, వెంకటమ్మ, చిట్టెమ్మ, మణెమ్మ హంసవేణి మీద దాడి చేశారు. చితకబాది ముఖంపై రాళ్లతో కొట్టారు. స్థానికులు హంసవేణిని బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కళ్లకు సమస్య ఉందని గుర్తించి తిరుపతి అరవింద ఐ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనలో హంసవేణికి రెండు కళ్లూ కనిపించకుండాపోయాయి. ఓ కన్ను పూర్తిగా కనిపించదని, మరో కన్ను గురించి మూడు నెలల తర్వాతగానీ చెప్పలేమని అరవింద ఐ ఆస్పత్రి నివేదిక ఇచ్చింది. అక్కడ 9 రోజుల పాటు చికిత్స పొందిన హంసవేణి సోమవారం డిశ్చార్జి అయ్యారు. దివ్యాంగుడైన కుమారుడితో పాటు ఈ మమె కూడా ఇంటికే పరిమితం కావడంతో ఇల్లు గడవడం ఇబ్బందిగా మారింది. ఈ విషయమై బంగారుపాళ్యం సీఐ నాగరాజురావు కేసు నమోదు చేశారు. మంగళవారం హరియమ్మ, ఆమె కోడలు వెంకటమ్మను అరెస్టు చేసి రిమాండుకు పంపించినట్లు సీఐ చెప్పారు. 'దాడిలో హంసవేణి ఓ కన్ను కోల్పోయింది, మరో కన్ను గురించి మూడు నెలలు గడిస్తేగానీ చెప్పలేం' అని సీఐ అన్నారు.

బంగారుపాళ్యం: హంసవేణి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ బంగారుపాళ్యం మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ భరోసానిచ్చారు. మంగళవారం ఆమెను పరామర్శించి ధైర్యం చెప్పారు. నాయకులు జనార్దన్ గౌడ్, హేమచంద్ర నాయుడు, సూరి నాయుడు, రమేష్, రవి, మల్లన్న, జానకిరామ్, సుబ్బన్న, బాబు తదితరులున్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులకు జీతాలు పెంపు

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు 23 శాతం పెంచుతూ సమగ్రశిక్ష తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. 2019 నుంచి ఒక్కసారి కూడా జీతం పెరగని వారికి ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. సెక్షన్ ఆఫీసర్లు, సిస్టమ్ ఎనలిస్టులు, సైట్ ఇంజనీర్లు (బీటెక్), సైట్ ఇంజనీర్లు (డిప్లొమా), మెసెంజర్స్, ఐఈఆర్‌టీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్లు, డ్రైవర్లకు జీతం పెంచుతున్నట్లు వివరించింది. ఉదాహరణకు సెక్షన్ ఆఫీసర్ జీతం ప్రస్తుతం రూ.28,940 ఉందని, తాజా పెంపుతో అది రూ.35,596 అవుతుందని తెలిపింది. అతి తక్కువ జీతాలున్న డ్రైవర్లకు కూడా ఇకపై రూ.24,600 వస్తుందని పేర్కొంది. సమగ్రశిక్ష ఉద్యోగులు తమకు జీతాలు పెంచాలంటూ దాదాపు నెల రోజుల పాటు సమ్మె చేశారు. దీంతో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కసారి కూడా జీతాలు పెంచని వారికి 23 శాతం పెంచుతామని అప్పట్లో విద్యాశాఖ మంత్రి హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా ఇప్పుడు ఉత్తర్వులు జారీఅయ్యాయి.

చీటీల పేరుతో రూ.కోటిన్నర టోకరా

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20: చీటీల పేరుతో రూ.కోటిన్నర టోకరా వేసిన ఘటన సూళ్లూరుపేటలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు.... సూళ్లూరుపేటకు చెందిన మొఘల్ చాంద్‌బాషా పట్టణంతో పాటు కోటపోలూరు, మన్నారుపోలూరు, లింగంపాడు, ఎన్‌వీకండ్రిగ గ్రామాల్లో పలువురి చేత దీపావళి చిట్‌ఫండ్‌తో పాటు నెలవారీ చీటీలు నిర్వహించేవాడు. చీటీ పాడుకొన్న వారికి నగదు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చాడు. దాదాపు రూ.కోటి 50 లక్షల వరకు వసూలు చేసిన చాంద్‌బాషా కొంతకాలంగా కనిపించకుండా తిరుగుతున్నాడు. బాధితులు కొందరు సోమవారం రాత్రి చాంద్‌బాషాను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. చీటీల పేరుతో డబ్బులు కట్టించుకొని మోసం చేశాడని ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకొన్న మిగిలిన బాధితులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని చాంద్‌బాషా తమను కూడా మోసం చేశాడని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు చాంద్‌బాషాపై చీటింగ్ కేసు నమోదు చేశారు. కాగా, అపాచీ కర్మాగారంలో పనిచేసే కార్మికులే ఎక్కువ మంది చాంద్‌బాషా వద్ద చీటీలు వేసినట్లు తెలిసింది.

వెస్ట్ పరిధిలో పోలీసుల తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 20: తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వెస్ట్ సీఐ జయనాయక్, ఎస్ఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బంది ఈ తనిఖీలు చేశారు. మంచాల వీధి, రాజన్నపార్క్ ప్రాంతాల్లోని పలు దుకాణాల్లో మద్యం, మత్తు పదార్థాలు తదితరాలకోసం గాలించారు. ఎక్కడా మత్తు పదార్థాలు లభ్యం కాలేదని సీఐ చెప్పారు.

ఆర్ఎస్ఐ ఇంట్లో చోరీ

6.4 సవర్ల బంగారం అపహరణ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 20: రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్(ఆర్ఎస్ఐ) ఇంట్లోనే దొంగలు చోరీకి పాల్పడిన సంఘటన నాయుడుపేట పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... వెంకటగిరి బెటాలియన్‌లో ఆర్ఎస్ఐగా పనిచేస్తున్న కోటేశ్వరరావు నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని తుమ్మూరులో నివాసం ఉంటున్నారు. ఈ నెల 17వ తేదీన కోటేశ్వరరావు విధులకు వెళ్లగా, ఆయన సతీమణి దేవసేనమ్మ ఇంటికి తాళాలు వేసుకొని నెల్లూరుకు వెళ్లింది. 19వ తేదీ సోమవారం ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉన్న 6.4 సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదు. చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం: ఏఐవైఎఫ్



సమావేశంలో పాల్గొన్న నాయకులు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 20: యువతకు ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. సీపీఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. సీఎం జగన్ ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన మాట నీటిమూటలైందని విమర్శించారు. మెగా డీఎస్సీ మరిచారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, కత్తిరవి, సంతోష్‌కుమార్, యుగంధర్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్స్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 20: ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ఈనెల 5నుంచి నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఒకేషనల్ కోర్సులకు ఈనెల5నుంచి 20వరకు మూడు స్పెల్స్‌లో, జనరల్ విద్యార్థులకు ఈనెల11నుంచి 20వ తేదీవరకు రెండుస్పెల్స్‌లో ఈ పరీక్షలను జరిగాయి. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించామని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

జైలుకు పోయేందుకు ‘సిద్ధం’గా ఉండు జగన్

అభివృద్ధిలో మాజీ సీఎం చంద్రబాబు సవాల్‌ను స్వీకరిస్తావా? : టీడీపీ నేతలు



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తిరుపతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలు తర్వాత జైలుకు వెళ్లేందుకు జగన్ రెడ్డి సిద్ధంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దంపూరి భాస్కర్ యాదవ్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ వ్యాఖ్యానించారు. మంగళవారం పార్టీ నేతలతో కలసి ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఫొటోతో ‘సిద్ధం’ అంటూ రాష్ట్రమంతా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని, వీటికి ఎక్కడ నుంచి నిధులు వెచ్చించారో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. సిద్ధం సభలో సంక్షేమ పథకాలగురించి ఆయన చెబుతుంటే నవ్వు వస్తోందన్నారు. ఇంటెలిజెన్స్ నివేదికలో వైసీపీ పని అయిపోయిందని జగన్‌రెడ్డి తెలుసుకున్నారని, అందుకే పెద్దఎత్తున అభ్యర్థులను మార్చడం జరిగిందన్నారు. సిద్ధం సభలో కార్యకర్తలను రెచ్చగొట్టేలా మాట్లాడి.. మీడియా ప్రతినిధులపై దాడి చేయిస్తున్నారని మండిపడ్డారు. విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై ఉన్మాద దాడులను ప్రజలు ఛీకొడుతున్నారన్నారు. అమరావతిని పూర్తిగా నాశనం చేసినందుకు సిద్ధమా? అభివృద్ధిపై మాజీ సీఎం చంద్రబాబు ఇచ్చిన సవాల్‌ను స్వీకరిస్తారా? అని ప్రశ్నించారు. సొంత పనుల కోసం ఢిల్లీకి పరుగులు తీస్తున్నారే తప్ప, రాష్ట్ర ప్రయోజనాల కోసం వెళ్లిన దాఖలాలు లేవని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు రామ్మూర్తి రాయల్, రుద్రకోటి సదాశివం, ఆనంద్ యాదవ్, కొట్టే హేమంత్ రాయల్, జగన్నాథం, ఆముదాల తులసీదాస్, బాలయ్య, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మూక దాడి సంస్కృతి అనాగరికం

ఎస్వీయూలో ఎస్ఎఫ్ఐ నిరసన



నిరసనలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు, విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 20: వైసీపీ మూక దాడి సంస్కృతి అనాగరికమని ఎస్ఎఫ్ఐ మండిపడింది. అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన సీఎం జగన్ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూక చేయడాన్ని నిరసిస్తూ ఎస్వీయూలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ వర్సిటీల సమన్వయకర్త అశోక్‌కుమార్, యూనివర్సిటీ కార్యదర్శి వినోద్ ప్రసంగించారు. ఈ దాడికి పాల్పడిన అల్లరి మూకలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో భాగంగా ఫొటో తీయడం నేరం ఎలా అవుతుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాస్వామిక వాతావరణం నశించి, నియంత పోకడ పెరుగుతోందని విమర్శించారు. రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలనకు ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడి సాక్ష్యమన్నారు. ఈ దాడిని సీఎం జగన్, వైసీపీ నాయకులు, పోలీసులు ఖండించకపోవడం సిగ్గుచేటని అభిప్రాయపడ్డారు. కనీసం చట్టబద్ధంగా నడవాలనే స్పృహను వైసీపీ నాయకత్వం మరిచిపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా దాడికి పాల్పడిన వారిని గుర్తించి.. కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తద్వారా భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. లేకపోతే రాష్ట్రంలో జర్నలిస్టులతో కలిసి గట్టి ప్రజా ఉద్యమం వస్తుందని స్పష్టం చేశారు. విధి నిర్వహణలోని జర్నలిస్టులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని సూచించారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మౌనిక, నరేంద్ర, వీరేష్, దేవరాజులు, సాయినాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

నారా భువనేశ్వరిని కలిసిన సుగుణమ్మ



తిరుపతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం పర్యటనకు వచ్చిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరిని మాజీ ఎమ్మెల్యే, తిరుపతి టీడీపీ ఇన్‌చార్జి సుగుణమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఆమె కుప్పానికి వెళ్లి, భువనేశ్వరిని సత్కరించారు.

శ్రీవేంకటేశ్వర ఫ్యాబ్రికేటర్స్ అసోసియేషన్ కార్యవర్గం



సమావేశంలో ప్రసంగిస్తున్న మహేష్

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 20: శ్రీవేంకటేశ్వర ఫ్యాబ్రికేటర్స్ అసోసియేషన్ (వెల్డింగ్ పనులు) నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. యూత్‌హాస్టల్‌లో జరిగిన వార్షిక సమావేశంలో ఎన్నికలు జరిగాయి.అధ్యక్షుడిగా పి.మహేష్, ప్రధాన కార్యదర్శిగా గోవిందురెడ్డి, కోశాధికారిగా పి.రెడ్డెప్ప నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.శ్రీహరిరెడ్డి, ఉపాధ్యక్షులుగా జయరామ్, మునిరత్నం, హబీబ్, జాయింట్ సెక్రటరీలుగా వి.చంద్రాచారి, కె.చంద్రశేఖర్, అధికార ప్రతినిధిగా బి.సిద్ధలింగయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పి.నాగరాజు, సిద్ధయ్యలతోపాటు పది మంది కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మహేష్ తెలిపారు.

టూవీలర్ మెకానిక్‌లకు ప్రమాద బీమా

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 20: ప్రమాద బీమా సౌకర్యాన్ని మెకానిక్‌లు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి టూవీలర్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి సూచించారు. మంగళవారం గాంధీభవన్ ఆవరణంలో జరిగిన అసోసియేషన్ నెలవారీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రతి కార్మికుడు రూ.390 చెల్లించి రూ.5లక్షల ప్రమాద బీమా పొందే ఏర్పాటు చేశామన్నారు. వాల్వో లైన్ ఇంజిన్ ఆయిల్స్ అధినేత తులసీరామిరెడ్డి, కాస్ట్రోల్ ఆయిల్స్ డీలర్ శశికాంత్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ కార్డుల పంపిణీ

తిరుపతి(కొర్లగుంట): శ్రీబాలాజీ టూవీలర్ మెకానిక్ సంక్షేమ సంఘం తొలి వార్షికోత్సవం యూత్ హాస్టల్లో మంగళవారం నిర్వహించారు. 150మంది సంఘం సభ్యులకు ఈఎస్ఐ కార్డులను పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు ఎన్.ఆర్.బాషా, వోల్వోలైన్, మోబిల్, మ్యాక్ ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, అమరాన్, పవర్‌జోన్, ఎక్సైడ్ బ్యాటరీ కంపెనీల ప్రతినిధులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

23, 24తేదీల్లో తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 20: పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని తమిళనాడులోని తిరువణ్ణామలైకి వెళ్లే భక్తుల కోసం ఈనెల 23, 24తేదీల్లో 150 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు సీటీఎస్ ఏటీఎం డి.రామచంద్రనాయుడు తెలిపారు. 23న ఉదయం 4గంటల నుంచే బస్సులు ప్రారంభమవుతాయి. గంటకో బస్సు సీటీఎస్ నుంచి బయల్దేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 24న మధ్యాహ్నం 2గంటల వరకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. అలాగే 150లో రిజర్వేషన్‌కు 60 బస్సులు కేటాయించారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో ఏసీ బస్సులను కూడా నడుపుతున్నారు. ప్రయాణికులుసద్వినియోగం చేసుకోవాలని ఏటీఎం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



హాజరత్తయ్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 20: ఎస్వీయూ తెలుగు విభాగ పరిశోధకుడు టి.హాజరత్తయ్య డాక్టరేట్ పొందారు. రారా కాల్పనిక సాహిత్యం - పరిశీలన అంశంపై ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ప్రస్తుతం కడప ఆర్ట్స్ కాలేజీ అధ్యాపకులుగా ఉన్నారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణలు చేశారు. వివిధ పరిశోధనా వ్యాసాలు ప్రచురించారు.

ఆర్ఎస్ఎస్ ప్రచారకర్తకు సన్మానం



ఆదిత్యను సన్మానిస్తున్న నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఫిబ్రవరి 20: ఆంధ్రప్రదేశ్ ఆర్ఎస్ఎస్ ప్రచారకర్త ఆదిత్యను మంగళవారం సన్మానించారు. జిల్లా పర్యటనలో భాగంగా తిరుపతికి వచ్చిన ఆయనకు కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్టు చైర్మన్ పి.సి.రాయలు ఆహ్వానం పలికి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు భానుప్రకాష్‌రెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్, ప్రభాకర్ నాయుడు, వేణుగోపాల్‌రెడ్డి, మధుసూదన్, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, డాక్టర్ శ్రీహరిరావు, శ్రీదేవి, బాబు, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం



తిరుమల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని లోకకల్యాణం కోసం తిరుమల నాదనీరాజనం వేదికపై మంగళవారం ఉదయం టీటీడీ చేపట్టిన విష్ణుసహస్రనామ స్తోత్ర అఖండ పారాయణం భక్తిభావాన్ని పంచింది. పలువురు భక్తులు నేరుగా పాల్గొనగా, ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం ద్వారా లక్షలాది మంది తమ ఇళ్లలోనే పారాయణం చేశారు. ఈ సందర్భంగా తిరుమల వేదవిజ్ఞానపీఠం ఆచార్యులు కోగంటి రామానుజాచార్యులు, మారుతి, అనంతగోపాలకృష్ణ అఖండ పారాయణం చేశారు. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారిణి కవిత బృందం ‘అని యానతిచ్చే కృష్ణుడర్జునునితో..’ కీర్తనను ఆలపించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి ధర్మగిరి వేదపాఠశాల, తిరుపతిలోని ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ, కంచి కామకోటి పీఠం వేద పాఠశాలలకు చెందిన వేదపండితులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.82 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.82 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 64,741 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 24,667 మంది తలనీలాలు సమర్పించారు.

24న సత్యనారాయణస్వామి వ్రతం

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 20: సత్యనారాయణ స్వామి ఉచిత సామూహిక వ్రతం ఈనెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ నరసింహులు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. శనివారం ఉదయం తొమ్మిది గంటలకు కొత్తవీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరగనున్న ఈ వ్రతాన్ని ఆలయ పాలకమండలి, శ్రీవారి సేవకుల అసోసియేషన్, ఆర్య వైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

హుండీ కానుకలను శ్రీవారికి, భక్తులకే వినియోగించాలి

మాజీ మంత్రి అమరనాథ రెడ్డి



తిరుమల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ కానుకలను భగవంతుడికి, భక్తుల కోసమే వినియోగించాలని టీటీడీని కోరుతున్నానని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి అన్నారు. అలా చేస్తేనే స్వామికి భక్తులు సమర్పించిన కానుకలకు అర్థం, పరమార్థం లభిస్తుందని చెప్పారు. శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే.. ‘రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామిని కోరుకున్నా. అలా ఉండాలంటే ఏం చేయాలో నాకంటే భగవంతుడికే బాగా తెలుసు. పవిత్రమైన తిరుమలలో రాజకీయాలు మాట్లాడకూడదు. కేవలం గోవిందనామస్మరణే చేయాలి. రాజకీయాలు మాట్లాడటానికి చాలా ప్రదేశాలున్నాయి. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి తిరుమలకు ప్రత్యేకత తీసుకొచ్చారు. ఆయన తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు కూడా దాన్ని పాటించారు. ఈ సంప్రదాయం రానురాను దిగజారే పరిస్థితి కనిపిస్తోంది. ప్రజలు దీన్ని గమనిస్తున్నారు. కొండపై రాజకీయాలు మాట్లాడటాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నా. ఈ విషయాన్ని అర్థం చేసుకుంటే భక్తి ఉందనుకోవాలి. అలాకాకుండా రాజకీయాలు మాట్లాడుతూనే ఉంటే భగవంతుడే చూసుకుంటాడు’ అని అమరనాథరెడ్డి వివరించారు.

సీనియర్ జర్నలిస్టు మనోహర నాయుడు మృతి



తిరుపతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుగా తిరుపతిలో సుదీర్ఘకాలం పని చేసిన మనోహర నాయుడు అనారోగ్యంతో మృతి చెందారు. డ్యూటీ నుంచి వెళ్తున్న ఆయన 20 ఏళ్ల కిందట ప్రమాదానికి గురయ్యారు. వెన్నెముక దెబ్బతినడంతో ఇంతకాలం కదల్లేని స్థితిలో ఉన్నారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలోనూ ఆయన సబ్ ఎడిటర్‌గా పనిచేశారు. ఇటీవల ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రిలో చేర్చారు. సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. మంగళవారం మధ్యాహ్నం గోవిందధామంలో ఆయన అంత్యక్రియలు పూర్తయ్యాయి. పలువురు జర్నలిస్టులు ఆయనకు నివాళులర్పించారు.

వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలను అభినందిస్తున్న అధ్యాపకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 20: పద్మావతి డిగ్రీ కాలేజీలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో ధనూష (తెలుగు), దివ్యశ్రీ (ఆంగ్లం) ప్రథమ బహుమతులు సాధించగా, ప్రేమేంద్రిక(తెలుగు) తృతీయ బహుమతి పొందారు. వీరిని ప్రిన్సిపాల్ నారాయణమ్మ, తెలుగు విభాగాధిపతి కృష్ణవేణి, అధ్యాపకులు అభినందించారు.

వీధి వ్యాపారులకు గొడుగుల వితరణ



తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 20: ఎండల తీవ్రత పెరుగుతుండటంతో వీధి వ్యాపారులకు మంగళవారం గొడుగులను ప్రత్యేక రాయలసీమ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కూరపాటి సురేష్ ఆధ్వర్యంలో వితరణ చేశారు. సమితి ప్రతినిధులు నాగరాజురెడ్డి, అబ్దుల్‌రఫీ, సురేష్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

23న జాబ్ మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 20: ఎస్వీయూలో ఈనెల 23వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. భార్గవి ఆటోమొబైల్స్, మదర్ సన్ సుమి, టాటా బిగ్ బాస్కెట్, కర్ణాటక ప్లాస్టో ఇండస్ట్రీ ఈ మేళాలో పాల్గొంటాయి. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన వారు అర్హులు. ఈ సంస్థల్లో సుమారు 800కిపైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని నిర్వాహకుడు శ్రీనివాసులు తెలిపారు.

భార్య అలిగి వెళ్లిపోయిందని..

మనస్తాపంతో లోయలోకి దూకబోయిన భర్త - పోలీసుల చొరవతో తిరిగి కుటుంబీకుల చెంతకు



శ్రీనివాసరావుకు సాయిహర్షను అప్పగిస్తున్న పోలీసులు

తిరుమల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): భార్య గొడవపడి వెళ్లిపోయిందని మనస్తాపంతో ఓ వ్యక్తి లోయలోకి దూకి ఆత్మహత్య చేసుకోబోయాడు. పోలీసుల చొరవతో అతను తన కుటుంబ సభ్యుల వద్దకు క్షేమంగా చేరాడు. తిరుమల టూటౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. విజయవాడకు చెందిన సాయి హర్ష(32) తన భార్య, తల్లిదండ్రులు, కుటుంబీకులతో కలిసి శ్రీవారి దర్శనార్థం సోమవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నాడు. సప్తగిరి అతిథి గృహంలో ఓ గదిని అద్దెకు పొంది.. అందరూ రాత్రి దర్శనానికి వెళ్లారు. ఆ సమయంలో సాయి దంపతుల మధ్య గొడవ జరిగింది. కోపంతో భార్య చెప్పా పెట్టకుండా తిరుమల నుంచి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన సాయి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. గది నుంచి తెల్లవారుజామున వెళ్లిపోయాడు. కొంత సమయానికి తండ్రి శ్రీనివాసరావు గుర్తించి తిరుమల టూటౌన్ సీఐకి విషయాన్ని తెలిపాడు. హర్షకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయకపోవడంతో అప్రమత్తమైన సీఐ వెంటనే టవర్ లోకేషన్‌ను గుర్తించారు. కాలినడక మార్గంలోని అవ్వాచారి కోన లోయ వద్ద ఉన్నట్టు తేలింది. వెంటనే అక్కడికి వెళ్లి సాయిని అదుపులోకి తీసుకున్నారు. లోయలోకి దూకి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడని తెలుసుకుని.. కౌన్సెలింగ్ ఇచ్చి, తండ్రికి అప్పగించారు. తన కుమారుడిని క్షేమంగా అప్పగించిన సీఐ, సిబ్బందికి శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు.

వంటావార్పుతో కార్మికుల నిరసన

మద్దతు తెలిపిన ఓబీసీ ఫోరం



కార్మికులకు మద్దతు తెలుపుతున్న బడి సుధాయాదవ్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 20: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఎస్వీ వ్యవసాయ కళాశాల, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం కూడా కొనసాగింది. కళాశాల ప్రధానద్వారం ఎదుట రోడ్డుపై వంటావార్పుతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. వీరికి ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధా యాదవ్ మద్దతు తెలిపారు. తన సొంత నిధులతో దీక్ష పూర్తయ్యేవరకు షామియానా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి చొరవ చూపి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి నాగవెంకటేష్ ప్రసంగించగా, సంఘ అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి లోకేష్, నాయకులు సుబ్బు, రేవతి, చంద్రమ్మ, అనురాధ, మునిలక్ష్మి, రమా, మురళి పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ అభివృద్ధికి కృషి : ఎంపీ



గురుమూర్తిని సన్మానించిన వీసీ భారతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 20: పద్మావతి మహిళా యూనివర్సిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా తోడ్పడతానని ఎంపీ గురుమూర్తి అన్నారు. ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ (పీఎం ఉష) పథకాన్ని వర్చువల్‌గా ప్రధాని మోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించగా, వర్సిటీ ఆడిటోరియంలో అధికారులతో కలిసి ఎంపీ వీక్షించారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ.. ఈ పథకం కింద రూ.100 కోట్ల నిధుల విడుదలకు ప్రణాళికాబద్ధంగా పనిచేసిన వర్సిటీ అధికారులను అభినందించారు. వీసీ భారతి మాట్లాడుతూ.. ఈ నిధులతో మౌలిక వసతులు, కొత్త కోర్సులు ఏర్పాటు చేస్తామన్నారు. రిజిస్ట్రార్ రజని మాట్లాడుతూ.. పరిశోధనా ప్రాజెక్టుల మంజూరుకు ఎంపీ తగిన తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘పాలిసెట్’కు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 20: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకోసం నిర్వహించే ఏపీ పాలిసెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఈమేరకు ఏపీ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ వెలువరించింది. ఏప్రిల్ ఐదో తేదీలోపు దరఖాస్తులకు గడువు కాగా, అదేనెల 27న ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు పరీక్ష జరగనుంది. మే ఐదో తేదీన ఫలితాలను విడుదల చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. దరఖాస్తు కోసం హెచ్‌టీటీపీఎస్://పాలిసెట్‌ఏపీ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌నిసంప్రదించాలి.

గగనలో ఉచిత నమూనా పరీక్షలు: భవానీనగర్ రాజన్నపార్క్ సమీపంలో ఉన్న శ్రీగగన కోచింగ్ సెంటర్‌లో పాలిసెట్‌కి ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత నమూనా పరీక్షలు, తరగతులు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఎ.కరుణామూర్తి పేర్కొన్నారు. వివరాలకు 90140 52757, 98856 90099 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

‘ఎన్నికల’ కేసులకు ప్రాధాన్యమివ్వండి : ఎస్పీ



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ మలికా గర్గ్

తిరుపతి (నేర విభాగం), ఫిబ్రవరి 20: ఎన్నికలకు సంబంధించిన కేసులకు ప్రాధాన్యమివ్వాలని ఎస్పీ మలికా గర్గ్ ఆదేశించారు. మంగళవారం ఈస్ట్ పోలీస్ స్టేషన్ను తనిఖీ చేశారు. ఎస్పీగా బాధ్యతలు తీసుకున్నాక ప్రధానమైన ఈస్ట్ పోలీస్ స్టేషన్‌ను, తిరుపతి పోలీస్ సబ్‌డివిజన్‌ను తొలిసారిగా పరిశీలించారు. డీఎస్పీ సురేంద్రరెడ్డి, ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలను ఆరా తీశారు. బైండోవర్లను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. కేసుల విషయంలో నిజాయితీగా వ్యవహరించాలని, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు గస్తీని ముమ్మరం చేయాలని సూచించారు. నైట్‌బీట్‌ను బలోపేతం చేసి, విజిబుల్ పోలీసింగ్ విస్తృతంగా నిర్వహించాలన్నారు. గట్టి నిఘాపెట్టి గంజాయి, మత్తు పదార్థాల రవాణాను అరికట్టాలని, విక్రయదారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. ఎస్బీ డీఎస్పీ భాస్కర్‌రెడ్డి తిరుపతి డీఎస్పీ సురేంద్రరెడ్డి, సీఐ మహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



కారుమూరి నాగేశ్వరరావు - ప్రియాంక జవాల్కర్ - నటి శ్రీలీల - నటి సుహాసిని - నటుడు రఘు

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, త్రిపుర మాజీసీఎం బిప్లబ్ కుమార్,ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌రావు, టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, హీరోయిన్ ప్రియాంక జవాల్కర్, నటులు రఘు, సుహాసిని ఉన్నారు. అలాగే అర్చన సేవలో హీరోయిన్ శ్రీలీల తన తల్లితో కలిసి స్వామిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

చీటీల పేరుతో రూ.కోటిన్నర టోకరా



పోలీస్ స్టేషన్ వద్ద బాధితులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20: చీటీలో పేరుతో రూ.కోటిన్నర టోకరా వేసిన ఘటన సూళ్లూరుపేటలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు.... సూళ్లూరుపేటకు చెందిన మొఘల్ చాంద్‌బాషా పట్టణంతో పాటు కోటపోలూరు, మన్నారుపోలూరు, లింగంపాడు, ఎన్‌వీకండ్రిగ గ్రామాల్లో పలువురి చేత దీపావళి చిట్‌ఫండ్‌తో పాటు నెలవారీ చీటీలు నిర్వహించేవాడు. చీటీ పాడుకొన్న వారికి నగదు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చాడు. దాదాపు రూ.కోటి 50 లక్షల వరకు వసూలు చేసిన చాంద్‌బాషా కొంతకాలంగా కనిపించకుండా తిరుగుతున్నాడు. బాధితులు కొందరు సోమవారం రాత్రి చాంద్‌బాషాను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. చీటీల పేరుతో డబ్బులు కట్టించుకొని మోసం చేశాడని ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకొన్న మిగిలిన బాధితులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని చాంద్‌బాషా తమను కూడా మోసం చేశాడని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు చాంద్‌బాషాపై చీటింగ్ కేసు నమోదు చేశారు. కాగా, అపాచీ కర్మాగారంలో పనిచేసే కార్మికులే ఎక్కువ మంది చాంద్‌బాషా వద్ద చీటీలు వేసినట్లు తెలిసింది.

క్యాన్సర్‌పై అవగాహన కలిగివుండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మి

గూడూరు, ఫిబ్రవరి 20: క్యాన్సర్‌పై సరైన అవగాహన కలిగివుంటే వ్యాధి నుంచి విముక్తిని పొందవచ్చునని క్యాన్సర్ ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక సునీత సేవా సంస్థ కార్యాలయంలో సేవాసంస్థ ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన ఇండియన్ రెడ్‌క్రాస్, ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు వాడడం, మద్యం సేవించడం, రసాయనాలతో కూడి ఆహారాన్ని భుజించడం, శారీరక శ్రమ లేకపోవడం వంటి వాటి వల్ల క్యాన్సర్ సోకే అవకాశం ఉందన్నారు. పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్య సంరక్షణకు తగు జాగ్రత్తలు పాటించడం, మంచి ఆహారపు అలవాట్లును పాటించడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. క్యాన్సర్ వ్యాధిని తొలిదశలో గుర్తించడం ద్వారా త్వరితగతిన నయం చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, సులక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది పద్మజ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలతో విద్యార్థులు

బాలాయపల్లి, ఫిబ్రవరి 20: బాలాయపల్లిలో వరసిద్ధి వినాయక పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ శంకరమ్మ తెలిపారు. ఈ నెల 18న హైదరాబాద్‌లో రుద్రమదేవి మెగా కప్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో కరాటే, కుంగ్ ఫూ, థైక్వాండో పోటీలు నిర్వహించారు. ఇందులో ఎన్.బిందుజా, ఎన్.గేయవర్ధిని బంగారు పతకాలు, ఎం.వర్షిణి సిల్వర్, వై.లాక్షిత, కే.నందిని ప్రియ, జే.కమలేష్, పీ.కార్తికేయ, ఎం.శ్రీహర్ష, టీ.జశ్వంత్ బ్రాంజ్ పతకాలు సాధించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ఆర్ఎస్ఐ ఇంట్లో చోరీ

6.4 సవర్ల బంగారం అపహరణ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 20: రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్(ఆర్ఎస్ఐ) ఇంట్లోనే దొంగలు చోరీకి పాల్పడిన సంఘటన నాయుడుపేట పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... వెంకటగిరి బెటాలియన్‌లో ఆర్ఎస్ఐగా పనిచేస్తున్న కోటేశ్వరరావు నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని తుమ్మూరులో నివాసం ఉంటున్నారు. ఈ నెల 17వ తేదీన కోటేశ్వరరావు విధులకు వెళ్లగా, ఆయన సతీమణి దేవసేనమ్మ ఇంటికి తాళాలు వేసుకొని నెల్లూరుకు వెళ్లింది. 19వ తేదీ సోమవారం ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉన్న 6.4 సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదు. చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

రెండు మోటారు సైకిళ్ల చోరీ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 20: నాయుడుపేట పట్టణంలో సోమవారం రాత్రి రెండు మోటారు సైకిళ్ల చోరీ అయ్యాయి. బ్రాహ్మణవీధిలో నివాసం ఉంటున్న కానిస్టేబుల్, సీఎస్‌తేజ సెంటర్‌లో నివాసం ఉంటున్న మహేష్ సోమవారం రాత్రి తమ ఇళ్ల ముందు మోటారు సైకిళ్లను పార్క్ చేశారు. మంగళవారం ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదు. చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బ్యాంక్ మేనేజర్‌పై దాడి: కేసు నమోదు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 20: పట్టణంలోని ఓ బ్యాంక్ మేనేజర్‌పై ఇద్దరు యువకులు దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. చిన్నదర్గావీధిలో ఓ బ్యాంకు మేనేజర్ మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఓ కారు రాసుకుంటూ వెళ్లింది. ఈ విషయమై మేనేజర్‌కు, కారులో ఉన్న వ్యక్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కారులో ఉన్న ఇద్దరి యువకులు దుర్భాషలాడుతూ తనపై దాడిచేసినట్లు మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్ల అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

భార్య అలిగి వెళ్లిపోయిందని..

మనస్తాపంతో లోయలోకి దూకబోయిన భర్త - పోలీసుల చొరవతో తిరిగి కుటుంబీకుల చెంతకు



శ్రీనివాసరావుకు సాయిహర్షను అప్పగిస్తున్న పోలీసులు

తిరుమల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): భార్య గొడవపడి వెళ్లిపోయిందని మనస్తాపంతో ఓ వ్యక్తి లోయలోకి దూకి ఆత్మహత్య చేసుకోబోయాడు. పోలీసుల చొరవతో అతను తన కుటుంబ సభ్యుల వద్దకు క్షేమంగా చేరాడు. తిరుమల టూటౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. విజయవాడకు చెందిన సాయి హర్ష(32) తన భార్య, తల్లిదండ్రులు, కుటుంబీకులతో కలిసి శ్రీవారి దర్శనార్థం సోమవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నాడు. సప్తగిరి అతిథి గృహంలో ఓ గదిని అద్దెకు పొంది.. అందరూ రాత్రి దర్శనానికి వెళ్లారు. ఆ సమయంలో సాయి దంపతుల మధ్య గొడవ జరిగింది. కోపంతో భార్య చెప్పా పెట్టకుండా తిరుమల నుంచి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన సాయి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. గది నుంచి తెల్లవారుజామున వెళ్లిపోయాడు. కొంత సమయానికి తండ్రి శ్రీనివాసరావు గుర్తించి తిరుమల టూటౌన్ సీఐకి విషయాన్ని తెలిపాడు. హర్షకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయకపోవడంతో అప్రమత్తమైన సీఐ వెంటనే టవర్ లోకేషన్‌ను గుర్తించారు. కాలినడక మార్గంలోని అవ్వాచారి కోన లోయ వద్ద ఉన్నట్టు తేలింది. వెంటనే అక్కడికి వెళ్లి సాయిని అదుపులోకి తీసుకున్నారు. లోయలోకి దూకి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడని తెలుసుకుని.. కౌన్సెలింగ్ ఇచ్చి, తండ్రికి అప్పగించారు. తన కుమారుడిని క్షేమంగా అప్పగించిన సీఐ, సిబ్బందికి శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు.

జంగాలపల్లిలో ఐసర్ ఏర్పాటు చంద్రబాబు పుణ్యమే

● టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నారావు



ఐసర్ శంకుస్థాపనలో చంద్రబాబుతో అప్పటి కేంద్రమంత్రులు (ఫైల్‌ఫొటో)

ఏర్పేడు, ఫిబ్రవరి 20: మండలంలో అతి చిన్న గ్రామమైన జంగాలపల్లెల్లో ఐసర్‌ను ఏర్పాటు చేయడం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పుణ్యమేనని టీడీపీ మండలాధ్యక్షుడు నైనారు పొన్నారావు అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో.. జంగాలపల్లి గ్రామంలో 130 కుటుంబాలు నల్లగాజులు తయారు చేసి పలు ప్రాంతాల్లో అమ్ముకుంటూ జీవనం సాగించేవారన్నారు. అలాంటి గ్రామంలో కేంద్ర విద్యాసంస్థ ఏర్పాటు చేయడానికి కారకులైన చంద్రబాబు, వెంకయ్యనాయుడు, స్మృతి ఇరాని, బొజ్జలగోపాలకృష్ణారెడ్డి కుటుంబానికి ఆయన కృతజ్ఞలు తెలిపారు.

టీడీపీతోనే రాష్ట్రానికి ఉన్నత భవిష్యత్తు



సుబ్బానాయుడు కండ్రిగలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ హెలెన్

నాగలాపురం, ఫిబ్రవరి 20: చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు ఉన్నతమైన గ్యారంటీ ఉంటుందని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్ అన్నారు. మంగళవారం నాగలాపురం మండలంలోని సుబ్బానాయుడు కండ్రిగ గ్రామంలో ఆ గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు చెంచయ్య నాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, సీనియర్ నాయకుడు చెంచయ్య నాయుడు, పార్థిబన్, ఎండీ కుమార్, జాన్సన్, పవన్, తిరుపతి, జన సేనా మండలాధ్యక్షులు మణికంఠయ్య తదితరులు పాల్గొన్నారు.

23న రక్తదాన శిబిరం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి : ఈనెల 23న రక్తదాన శిబిరం జరుగుతుందని రోటరీ క్లబ్ కార్యదర్శి డాక్టర్ వెంకట రామన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. రెడ్ క్రాస్, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీరామ్ నగర్ కాలనీలోని రోటరీ క్లబ్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

వైసీపీ దాడిలో చూపే పోయింది

దివ్యాంగుడైన కుమారుడితో ఇంటికే వితంతువు పరిమితం ● టేకుమందలో ఆలస్యంగా వెలుగు చూసిన దారుణం



చిత్తూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడితో మాట్లాడటమే తప్పయింది. గ్రామంలో నీటి సమస్య ఉందని చెప్పడమే ఆమె నేరమైంది. దీన్ని మనసులో ఉంచుకుని అధికార పార్టీ నాయకుల ఇళ్లల్లోని మహిళలు గొడవకు దిగేవారు. చివరకు వీరి దాడిలో ఆ మహిళ రెండు కళ్లు దెబ్బతిని.. చూపే పోయింది. బంగారుపాళ్యం మండలం టేకుమందలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి.

బంగారుపాళ్యం మండలం టేకుమందకు చెందిన హంసవేణి భర్త రఘుపతి మూడేళ్ల కిందట మరణించారు. ఒక్కగానొక్క 16 ఏళ్ల కుమారుడు సుమన్ దివ్యాంగుడు. రెండు పాడి ఆవులతో పాటు కూలి పనులు చేసుకుంటూ ఆమె జీవనం సాగిస్తున్నారు. ఆ గ్రామంలో నెల కిందట పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఊరి బయటి చేతి పంపు నుంచి నీళ్లను తెచ్చుకుంటున్న హంసవేణిని ఆయన పలకరించారు. గ్రామంలో నీటి సమస్య ఉందని ఆమె చెప్పారు. 'టేకుమందలో తాగునీటి సమస్య ఉంటే సీఎం జగన్‌కు పట్టదా?' అంటూ ఆయన మీడియా సమావేశంలో ప్రశ్నించారు. హంసవేణి ఉంటున్న వీధిలో వైసీపీ సానుభూతిపరులు ఎక్కువ. ఈ విషయాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. హంసవేణి ఆవుల్ని కట్టేసేచోట వీరు మలవిసర్జన చేసి ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టేవారు. ఇదేంటని ఆమె ప్రశ్నించగా గొడవకు దిగేవారు. ఈ నెల 10వ తేది సాయంత్రం ఆ గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరుల ఇంట్లో మహిళలు హరియమ్మ, వెంకటమ్మ, కళమ్మ, తులసమ్మ, గీత, వెంకటమ్మ, చిట్టెమ్మ, మణెమ్మ హంసవేణి మీద దాడి చేశారు. చితకబాది ముఖంపై రాళ్లతో కొట్టారు. స్థానికులు హంసవేణిని బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కళ్లకు సమస్య ఉందని గుర్తించి తిరుపతి అరవింద ఐ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనలో హంసవేణికి రెండు కళ్లూ కనిపించకుండాపోయాయి. ఓ కన్ను పూర్తిగా కనిపించదని, మరో కన్ను గురించి మూడు నెలల తర్వాతగానీ చెప్పలేమని అరవింద ఐ ఆస్పత్రి నివేదిక ఇచ్చింది. అక్కడ 9 రోజుల పాటు చికిత్స పొందిన హంసవేణి సోమవారం డిశ్చార్జి అయ్యారు. దివ్యాంగుడైన కుమారుడితో పాటు ఈ మమె కూడా ఇంటికే పరిమితం కావడంతో ఇల్లు గడవడం ఇబ్బందిగా మారింది. ఈ విషయమై బంగారుపాళ్యం సీఐ నాగరాజురావు కేసు నమోదు చేశారు. మంగళవారం హరియమ్మ, ఆమె కోడలు వెంకటమ్మను అరెస్టు చేసి రిమాండుకు పంపించినట్లు సీఐ చెప్పారు. 'దాడిలో హంసవేణి ఓ కన్ను కోల్పోయింది, మరో కన్ను గురించి మూడు నెలలు గడిస్తేగానీ చెప్పలేం' అని సీఐ అన్నారు.

433 మందికి 'కల్యాణమస్తు, షాదీ తోఫా'

రూ.3.16కోట్లు జమ: కలెక్టర్



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 20: జిల్లాలో 'వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీ తోఫా' కింద గత ఏడాది అక్టోబరు నుంచి డిసెంబరు వరకు వివాహం చేసుకున్న 433మంది లబ్ధిదారులకు రూ.3.16కోట్లను జమ చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం జగన్ బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేసే కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఐదు విడతల్లో కలిపి మొత్తం 2,035మంది లబ్ధిదారులకు రూ.16.86 కోట్లను వారిబ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు వివరించారు. అనంతరం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష, ఎమ్మెల్యే సిపాయి సుబ్రహ్మణ్యం, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, సాంఘిక సంక్షేమ శాఖ, సాధికారత అధికారి చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ భయం లేదు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 20: పౌల్ట్రీ ఉత్పత్తులకు బర్డ్‌ఫ్లూ భయం లేదని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ ఏ.రవికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం పశువైద్యాధికారుల బృందం మండల పరిధిలోని తడుకు, వేణుగోపాలపురం, తొరూరు, తిరుమలకుప్పంలో కోళ్ల ఫారాలను, పెరటి కోళ్లను తనిఖీ చేసి కోళ్ల ఆరోగ్యంపై పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నెల్లూరు జిల్లాలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని కోళ్ల ఫారాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. మండల పరిధిలో చేసిన పరీక్షల్లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించలేదన్నారు. అన్నీ ఆరోగ్యంగానే ఉన్నట్లు చెప్పారు. అయినా ముందుజాగ్రత్త చర్యగా తీసుకోవాల్సిన చర్యలపై యజమానులకు అవగాహన కలిగించామన్నారు. స్థానికులు నిరభ్యంతరంగా పౌల్ట్రీ ఉత్పత్తులైన కోడి, గ్రుడ్లను ఆహారంగా తీసుకోవచ్చని వివరించారు. కోళ్లకు ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదురైతే వెంటనే చికిత్సలను అందించేందుకు రెండు ఆర్‌ఆర్‌టీ టీంలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. స్థానిక పశువైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో జిల్లా ఉపసంచాలకులు డాక్టర్ ఉమమహేశ్వరి, సహాయ సంచాలకులు డాక్టర్ గురునాథ్, సహాయ శస్త్ర చికిత్సకులు డాక్టర్ ప్రసూన, డాక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ పట్ల అప్రమత్తంగా ఉండండి

నారాయణవనం, ఫిబ్రవరి 20: మండలంలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు కలిగినా కోళ్ళ లేదని పశువైద్యధికారులు స్పష్టం చేశారు. మంగళవారం కొండలచెరువు, ఎరికంబట్టు, తుంబూరు, నైనారుకండ్రిగ, పాలమంగళం గ్రామాలను సందర్శించి గ్రామంలోని పెరటికోట్లు, పౌల్ట్రీ ఫారంలోని కోళ్లను తనిఖీ చేసి, అన్ని సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాయని, బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఎక్కడ లేదని నిర్ధారించారు. ప్రజలు ఎలాంటి భయందోళనలకు గురికావాల్సిన పనిలేదని గుర్తు చేశారు. కోళ్ల ఆరోగ్య విషయంగా ఏదైన సంహాదం ఉన్నట్లుయితే వెంటనే సమాచారం ఇవ్వాలని, ప్రస్తుతం మండలంలో వీటికోసం రెండు ఆర్‌ఆర్‌టీ టీములను ఏర్పాటు చేసి, పర్యవేక్షిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం పశు విజ్ఞాన బడిలో, పశువైద్యాధికారులు భార్గవి, కుమార్‌లు గ్రామాలలో పర్యటించి బర్డ్ ఫ్లూ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు

పాండురంగయ్యకు నివాళి



పాండురంగయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 20: పుత్తూరు విద్యుత్‌శాఖకు చెందిన 1104 యూనియన్ తిరుపతి ప్రాంతీయ, పుత్తూరు డివిజన్ అధ్యక్షుడు పాండురంగయ్య(46) భౌతికకాయానికి నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ మంగళవారం నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే ఆర్టీసీ కాలనీలో రిటైర్డ్ ఏఎన్ఎం కుసుమకుమారి, ఆచ్చారి వీధిలో స్కూల్ అటెండర్ ప్రభావతమ్మ భౌతికకాయాలను సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు ఉన్నారు.

వైభవంగా మహా రుద్రాభిషేకం

వడమాలపేట, ఫిబ్రవరి 20: మహాశివుని జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా మంగళవారం స్థానిక భవానీ శంకర్ దేవాలయంలో మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం మహాలింగానికి వేదమంత్రాలతో అభిషేకం నిర్వహించారు. రుద్ర గమకాలు పటిస్తూ భక్తుల శివనామ స్మరణల నడుమ మహారుద్రాభిషేకం నిర్వహించారు. పురోహితులు శివ, సాయి ఆధ్వర్యంలో మహాశివుని లింగానికి మంగళ హారుతలిచ్చారు.

పుత్తూరు వార్తలు

ఓటు హక్కును నిర్భయంగా వినియోంచుకోండి



గ్రామంలో పర్యటిస్తున్న శిక్షణ డీఎస్పీ

నారాయణవనం, ఫిబ్రవరి 20: ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని శిక్షణ డీఎస్పీ హిందూ ప్రియా అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని దిగువ కనకంపాలెం పంచాయతీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని, ప్రలోభాలకు గురికావద్దని, ఓటు వినియోగంలో ఎవరైన ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆమెతో పాటు ఎస్ఐ పరమేష్ నాయక్, సీపీఐ నాయకులు మహేష్, గ్రామస్థులు ఉన్నారు.

మీడియాపై దాడులు అరాచకానికి పరాకాష్ట



ధనంజయులు నాయుడు

వడమాలపేట, ఫిబ్రవరి 20: మీడియాపై దాడులకు పాల్పడడం అరాచకానికి పరాకాష్ట అని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు అన్నారు. మంగళవారం వడమాలపేటలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం ఆయన మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా కళ్లకు కట్టినట్లుగా చూపెట్టే ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి పాల్పడడం దారుణమని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉన్న మీడియా ప్రతినిధులపై దాడులు ప్రమాకరమని, న్యాయస్థానం సుమోటోగా స్వీకరించి దోషులను శిక్షంచేలా చర్యలు చేపట్టాలని ధనంజయులు నాయుడు అన్నారు.

సూపర్‌మార్ట్ ఏర్పాటుకు సన్నాహాలు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 20: మున్సిపల్ పరిధిలో డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో జగనన్న సూపర్‌మార్టు ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి తెలిపారు. మంగళవారం కావమ్మ ఆలయం పక్కన ఉన్న మున్సిపల్ భవనంలో మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కో ఆపరేటివ్ శాఖ సహకారంతో సూపర్‌మార్టు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం పుత్తూరు శ్మశానవాటికలో పనుల పురోగతి, మున్సిపల్ నూతన కార్యాలయ భవనంలో పనులను పరిశీలించారు.

బీఎల్‌వో తేజస్విని సస్పెండ్ చేయాలి: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 20: వైసీపీ పెద్దలకు సలహాతో దొంగ ఓట్ల నమోదుకు సహకరించిన బీఎల్‌వో తేజస్విని ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేయాలని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ఐదవ వార్డు చౌటూరు, 41వ బూత్‌లో 8 మంది ఓటర్లు గ్రామం వదిలి పక్కనే ఉన్న సత్యవేడు నియోజకవర్గం, నారాయణవనం మండల పరిధిలోని తిరుట్యం గ్రామంలో స్థిరపడ్డారని చెప్పారు. వీరందరికీ పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని చౌటూరులోను, నారాయణవనం మండలంలోని తిరువట్యంలోను రెండు చోట్లా ఓటు హక్కు ఉన్నట్లు ఆధారాలతో సహా చూపారు. ఇంటింటికి తిరిగి గ్రామం వదిలివెళ్లి పోయిన, మృతి చెందిన ఓటర్లను తొలగించాల్సిన బీఎల్‌వో తేజస్విని అధికార పార్టీ నాయకుల సూచనల మేరకు ఓటరు జాబితాను రూపొందించారని ఆరోపించారు. ఇదివరకు వివాహం చేసుకుని వెళ్లిపోయిన, గ్రామం నుంచి శాశ్వతంగా పక్క రాష్ట్రానికి వెళ్లిన పోయిన 19మంది ఓట్లను తొలగించాలని బీఎల్‌వో తేజస్విని దృష్టికి తీసుకువెళ్తే తమపై అకారణంగా పోలీస్ కేసు నమోదు చేయించిందని ధ్వజమెత్తారు. దీనిపై నగరి ఆర్‌డీవో, పుత్తూరు మున్సిపల్ కమిషనర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుత్తూరులో అధికారులు వైసీపీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దొంగ ఓట్లను తొలగించకపోగా, ప్రశ్నిస్తే తమపైన పోలీసు కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా నగరి ఆర్‌డీవో స్పందించి దొంగ ఓట్ల తొలగింపుపై చర్యలు తీసుకోకుంటే ఎన్నికల కమిషన్‌కు ఆధారాలతో సహ ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అలాగే పారదర్శకంగా ఎన్నికలు జరగాలంటే బీఎల్‌వో తేజస్విని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర వన్నికుల సాధికార సమితి సభ్యులు అయ్యప్పరెడ్డి, నాయకులు నాగరాజు, కుమార్, ఏలుమైరెడ్డి, వెంకటేష్‌యాదవ్, చిదంబరం పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను వెనక్కి ఇవ్వండి



భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 20: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను వెనక్కి ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పుత్తూరు పట్టణంలోని భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం బిల్లు పార్లమెంట్‌లో పెట్టి సాధించిన ఘనత ఏఐటీయూసీదేనని, అయితే కార్మికుల సంక్షేమ నిధులు దారి మళ్లించి రాష్ట్ర ప్రభుత్వం వాడుకున్నదని, వెంటేనే ఆ నిధులను వెనక్కి జమ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వేల మంది కార్మికుల క్లైములు లేబర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. ఈ నెల 29 కలెక్టర్ కార్యాలయం వద్ద ఇంటి స్థలాల సమస్యలపై ధర్నా కార్యక్రమానికి కార్మికులు పెద్ద ఎత్తున వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పుత్తూరు డివిజన్ కార్యదర్శి మహేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చంద్రబాబు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి చిరంజీవి, నాయకులు శరవణ, చంద్రశేఖర్, చెంగయ్య, శివ, నీలకంఠం, శ్రీనివాసులు, కైలాసం, దేశయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని కూలదోస్తాం: సర్పంచులు



సమావేశంలో ఎస్‌బీఆర్ పురం సర్పంచు మణిరాజు

వడమాలపేట, ఫిబ్రవరి 20: సర్పంచుల అధికారాలను లాక్కుని పంచాయతీలను నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని కూలదోస్తామని పంచాయతీరాజ్ ఛాంబర్ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బీఆర్ పురం సర్పంచు మణిరాజు అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం అమరావతిలో జరిగిన సమావేశంలో నగరి నియోజకవర్గం పరిధిలో సర్పంచులు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, విజయపురం సర్పంచు ధనంజయ యాదవ్ మాట్లాడుతూ సర్పంచుల అధికారాలను వైసీపీ ప్రభుత్వం కాలరాస్తూ పంచాయతీలకు కేంద్ర నుంచి వచ్చిన నిధులను పక్కదోవ పట్టించిందని ఆరోపించారు. సమారుగా రూ.8620 కోట్లను ఇతరత్రా పథకాలకు మళ్లించి పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అవరోధంగా కల్పించారని అన్నారు.

ప్రజల్లోకి కేంద్ర ప్రభుత్వ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 20: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీధర్ చెప్పారు. మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల నరేంద్రమోదీ పాలనలో సాధించిన విజయాలు, పథకాలపై ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎన్ హరిబాబు, జిల్లా కార్యదర్శి కోటకొండ బాబు, జిల్లా ఓబీసీ కార్యదర్శి శంకర్ నాయకులు మధు, మునస్వామి, హరి, చక్రపాణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు



వైసీపీ నాయకుడిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

టీడీపీలోకి వలసల జోరు

తొట్టంబేడు, ఫిబ్రవరి 20: శ్రీకాళహస్తి మండలంలోని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి స్వగ్రామం ఊరందూరులో ఇటీవల టీడీపీలో చేరిన జడ్పీటీసీలకు మంగళవారం తేనేటివిందు ఏర్పాటు చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని వారంతా పేర్కొన్నారు. అనంతరం తొట్టంబేడుమండలం ఇలగనూరు పంచాయతీకి చెందిన వైసీపీ నాయకుడు పాచిబాబుకి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి, తొట్టంబేడు జడ్పీటీసీ అర్చనాదేవి, ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య, తొట్టంబేడు మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, మునిరాజనాయుడు, ప్రతాప్‌రెడ్డి,మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ చేసిన అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటెయ్యండని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి కోరారు. శ్రీకాళహస్తి మండలంలోని మాధవమాల, వేలవేడు, మన్నవరం గ్రామాల్లో మంగళవారం ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో టీడీపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కామేష్‌యాదవ్, జడ్పీటీసీలు వెంకటసుబ్బారెడ్డి, అర్చనాదేవి, తిరుమలయ్య, నాయకులు చెంచయ్యానాయుడు, ఈశ్వర్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

రేణిగుంట, ఫిబ్రవరి20: పట్టణంలో ఓ వివాహిత అదృశ్యం అయిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అరుణకుమార్‌రెడ్డి తెలిపారు. రేణిగుంట మండలం వెదుళ్ళచెరువుకు చెందిన ప్రియ తన తల్లి అరుణకు వైద్యపరీక్షలు చేయించేందుకు రేణిగుంట తీసుకువచ్చి ప్రైవేటు ఆస్పత్రిలో తల్లిని వదలి వెళ్ళినట్లు ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఐదు గంటల్లో ట్రాక్ పునరుద్ధరణ

రేణిగుంట, ఫిబ్రవరి20: స్థానిక రైల్వేస్టేషన్ సౌత్‌యార్డ్‌లో సోమవారం రాత్రి 9.10 గంటలకు గూడ్స్‌రైలు పట్టాలు తప్పడంతో సిబ్బంది ఐదుగంటల్లో పునరుద్ధరణ పనులు చేశారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి రాత్రి 2గంటలకు రైలు మార్గాన్ని సిద్ధం చేశారు. అప్పటివరకు చెన్నై నుంచి రేణిగుంట మీదుగా ముంబయి, తిరుపతి, భువనేశ్వర్,విశాఖ వెళ్ళవలసిన ఎక్స్‌ప్రెస్‌లు ఐదు గంటలు ఆలశ్యంగా నడిచాయి. .గుంటకల్లు డివిజన్‌కు చెందిన పలువురు అధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

సిపాయి భరోసా అందజేత



భరోసా సరుకులు అందజేస్తున్న ఎమెల్సీ

తొట్టంబేడు, ఫిబ్రవరి 20: శ్రీకాళహస్తి మండలంలోని టీఎమ్‌వి కండ్రిగ గ్రామంలో మేళాగారం పాంచాలమ్మ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమెల్సీ డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం సిపాయి భరోసా కింద 52 నిత్యావసర వస్తువులను పాంచాలమ్మ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో వడ్లతాంగాళ్ బాలాజీరెడ్డి, రత్నంరెడ్డి, గురవారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీ వద్ద బాలిక మృతి

రేణిగుంట, ఫిబ్రవరి20: మండలంలోని గాజుల మండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాక్టర్ ఢీకొనడంతో చాందిని (5) అనే బాలిక మృతి చెందినట్టు ఎస్‌ఐ ధర్మారెడ్డి తెలిపారు. వివరాలిలా.. స్వర్ణముఖి నదీతీరంలోని గుర్రప్ప దేవాలయం సమీపంలో ఉన్న ఇటుక బట్టిలో ఒడిశాకు చెందిన వికాస్, సబిత దంపతులు కూలీలుగా పనిచేస్తున్నారు. మంగళవారం వారి కుమార్తె చాందినికి ట్రాక్టర్ తగలడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే చికిత్స నిమిత్తం రుయాకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందిందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడులకు నిరసనగా రాస్తారోకో



తహసీల్దార్ కార్యాలయంలో వినతిప్రత్రం అందజేస్తున్న దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 20: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ అల్లిరి మూలకులు దాడికి నిరసనగా బీఎన్‌కండ్రిగ జర్నలిస్టు సంఘాలు, టీడీపీ , సీపీఐ నాయకులు మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు నుంచి ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. అనంతరం సీనియర్ సహాయకుడు నాగరాజుకు వినితిప్రతం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, జర్నలిస్టు యూనియన్ నాయకుడు వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడు, మేదర కార్పొరేషన్ మాజీ చైర్మన్ సుందరయ్య, నాయకులు మధునాయుడు, మునిరాజా, బాబు, పెంచలయ్య, వీరరాఘవులు, రాధకృష్ణ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కావాలంటే చంద్రబాబును గెలిపించండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 20: అభివృద్ధి కావాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబును గెలిపించాలని గ్రథాలయ సంస్థ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడు కోరారు. మండలంలోని ఆలత్తూరు గ్రామంలో బాబు ష్యూరిటీ... భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూత్ కమిటీ అధ్యక్షుడు బాబు, వెంకీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల అక్షరాకృతి



బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 20: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో అ అక్షరం ఆకృతిలో విద్యార్థులు సోమవారం చాటుకున్నారు. ఇది ఎంతగానో ఆకట్టుకుంది.

చట్టాలపై అవగాహన పెరగాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాది రాజేశ్వరరావు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ న్యాయవాది రాజేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఉపకారాగారంలో మంగళవారం జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ... అందరికీ సమన్యాయం అందించడమే భారతీయ చట్టాల ఉద్దేశం అని తెలిపారు. ఇక సామాజిక న్యాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమేష్, శ్రీరామ్, పారా లీగల్ వాలంటీర్లు సాయిరాం, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

23న తుంబూరుకు భువనేశ్వరి

సత్యవేడు, ఫిబ్రవరి 20: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుతో కలత చెంది మరణించిన వారి కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించేందుకు నిజం గెలవాలి పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం నారాయణవనం మండలంలోని తుంబూరులో చంద్రబాబు అక్రమ అరెస్టుతో తల్లడిల్లి మృతి చెందిన మునివేలు కుటుంబాన్ని ఆమె పరామర్శించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

వలంటీర్లకు సన్మానం

సత్యవేడు, ఫిబ్రవరి 20: మండలంలోని వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఏవో రమణకుమార్ ఆధ్వర్యంలో గ్రామ వలంటీర్లకు పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. మండలంలో సేవరత్నకు ఎంపికైన గ్రామ వలంటీర్లతో పాటు సేవామిత్ర పురస్కారానికి సంబంధించి 271 మంది వలంటీర్లకు స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతిమ, జడ్పీటీసీ విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ శివయ్య, జూనియర్ అసిస్టెంట్ అయ్యప్ప, పంచాయతీ సెక్రటరీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం: బీఎస్పీ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ధనంజయ్

సత్యవేడు, ఫిబ్రవరి 20: రాష్ట్రంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం కాకుండా సీఎం జగన్ తన సొంత రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలుపరుస్తున్నారని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) నియోజకవర్గ ఇన్‌చార్జి ధనంజయ్ విమర్శించారు. అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ సభకు వార్తల కవరేజ్‌కోసం వెళ్లిన ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు దాడి చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టన్నారు. జర్నలిస్టులపై జరిగిన దాడిని సమర్థిస్తూ మాజీ మంత్రి కొడాలి నాని మాట్లాడిన తీరు జుగుప్సాకరంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలు, అక్రమాలకు, ప్రజలే తగిన శాస్తి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీనాయకులు, విగ్నేష్, వనరాజ్, శంకర్, వినోద్, ఆది శియరాజ్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు నేతల పరామర్శ



హేమలతను పరామర్శిస్తున్న నాగలాపురం నాయకులు

నాగలాపురం, ఫిబ్రవరి 20: సత్యవేడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే హేమలత గత వారం రోజులు క్రితం ఓ చిన్నపాటి ప్రమాదంలో శస్త్ర చికిత్స చేయించుకుని అపోలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం నాగలాపురం టీడీపీ నేతలు తిరుపతి, సామ్‌రాజ్, సౌందర్‌రాజ్, దీనా, సుగికుమార్ చెన్నైలోని ఆమె ఇంటికి వెళ్లి హేమలతను పరామర్శించారు.

ముక్కంటి సేవలో సినీ నటి



ముక్కంటి ఆలయాన్ని మంగళవారం సినీనటి సోనియా సింగ్ దర్శించుకున్నారు. స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించారు.

వేడుకగా భీష్మ ఏకాదశి ఉత్సవం



నగరోత్సవంలో ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20: ముక్కంటి ఆలయంలో మంగళవారం భీష్మ ఏకాదశి వేడుకగా జరిగింది. ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల తోపాటు శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి అలంకరించారు. మంగళవాయిద్యాలు, శివనామస్మరణ మధ్య ఉదయం 9:30 గంటలకు ఆలయం నుంచి ఉత్సవమూర్తులు ఊరేగింపు పారంభమైంది. ఆలయం వెలుపల వాహన మండపం నుంచి స్వామి అమ్మవార్లతో పాటు శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవమూర్తులు నగరోత్సవం చేశారు. నారదపుష్కరిణి వద్ద ప్రదక్షిణ పూర్వకంగా ఊరేగి విజ్ఞానగిరి వద్ద కొలువు దీరారు. అక్కడ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, నైవేద్యం హారతులు సమర్పించారు. అనంతరం సాయంత్రం తిరిగి మూడు గంటల సమయంలో విజ్ఞానగిరి వద్ద నుంచి ఉత్సవమూర్తులు ఊరేగింపుగా ముక్కంటి ఆలయానికి చేరుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఉత్సవంలో భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, పాలక మండలి సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ఎంజీఎం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న గుడ్లూరు మయూర్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20: తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లో జరిగిన సైన్స్ క్విజ్ పోటీల్లో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఎంజీఎం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. మంగళవారం ఐఐటీలో జరిగిన సైన్స్ పోటీల్లో ఎంజీఎం పాఠశాల నుంచి 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో 8వ తరగతి చదువుతున్న గురుపద్ నాయక్, 9వ తరగతి చదువుతున్న హన్సిత్ మొదటి స్థానంలో నిలిచి బహుమతులందుకున్నారు. వారిని పాఠశాల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మునిరత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ టీచర్లకు ఘన సన్మానం



సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహచరులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20: సాంఘిక శాస్త్రంలో విశేష సేవలందిస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పట్టణంలోని సరస్వతి బాయ్ పురపాలక సంఘ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి, తొట్టంబేడు, కేవీబి పురం మండలాలకు చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. శ్రీకాళహస్తి మండలం ఎగువీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జయ చంద్రయ్య, శ్రీకాళహస్తి పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు భారతి, తొట్టంబేడు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పద్మనాభంలను ఘనంగా సన్మానించారు. ఏపీ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సురేష్, హెచ్ఎం బృందాదేవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



పనులు పరిశీలిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20: విజ్ఞానగిరిపై జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండల చైర్మన్ అంజూరు శ్రీనివాసులు సూచించారు. ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్న విజ్ఞానగిరిపై జరుగుతున్న నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అలాగే విజ్ఞానగిరి కొండ ఆరంభంలో వినాయక మం డపం నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

మరింత వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు

● ముక్కంటి ఆలయ ఈవో నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20: ఏడాది మహాశివరాత్రి ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ముక్కంటి ఆలయ ఈవో నాగేశ్వరరావు తెలిపారు. ఆలయ పరిపాలనా భవనంలో మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ... గత ఉత్సవాల నిర్వహణపై ఇప్పటికే అధ్యయనం చేశామన్నారు. ఈ ఏడాది రెండు కీలకమైన మార్పులు చేస్తున్నట్లు వెల్లడించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా 14 రోజులు పాటు జరిగే సాంస్కృతిక కార్యక్రమాల వేదిక ధూర్జటి కళా ప్రాంగణాన్ని ఈ ఏడాది రాజగోపురం పక్కన ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతాయని పలువురు అధికారులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అలాగే భక్త కన్నప్ప మెట్ల మార్గం వైపు నుంచి ఆలయ నాలుగో ద్వారా మీదుగా మహాశివరాత్రి రోజున భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇక ఉత్సవాల్లో భాగంగా వాలంటీర్ల సహాయం తీసుకోవడం, పలు ప్రభుత్వ శాఖల సమన్వయంతో ముందుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఈఈ నూకరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తికి అభిషేకాలు చేసి, నిమ్మకాయలు, పూలమాలతో అలంకరించి భక్తులకు దర్శనం కలిగించారు. శ్రీకాళహస్తి పట్టణంతోపాటు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అంతకు మధ్యాహ్నం దాతలు ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

భక్తుల సేవే భగవంతుడి సేవ: ఈవో



రాహుకేతు పూజా మండపాన్ని తనిఖీ చేస్తున్న ఈవో నాగేశ్వరరావు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20: భక్తుల సేవే బగవంతుడి సేవగా భావించి భక్తులకు మెరుగైన సేవలు అందించాలని శ్రీకాళహస్తీశరాలయ ఈవో నాగేశ్వరావు సూచించారు. ముక్కంటి ఆలయంలోని పలు విభాగాలను మంగళవాం ఈవో తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రూ.500, రూ.1500 రాహు కేతు పూజ మండపం, ప్రసాదాల తయారీ కేంద్రాన్ని తనిఖీ చేసి, రాహుకేతు పూజల్లో భలవంతపు వసూళ్లకు పాల్పకూడదని ఆదేశించారు. భక్తులకు విక్రయించే ప్రసాదాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శృతి మించిన హత్యా రాజకీయాలు: టీడీపీ



గోపీనాథ్ రెడ్డి

శ్రీకాళహస్తి/కేవీబీపురం, ఫిబ్రవరి 20: రాష్ట్రంలో హత్య రాజకీయాలు శృతి మించిపోయాయని తిరుపతి పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షుడు గోపీనాథ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రకాష్ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం వారు రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పై జరిగిన హత్యాయత్నంపై విలేకరులతో మాట్లాడారు.. తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిపై వైసీపీ నాయకులు హత్యాయత్నం చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో రైతులంతా ఈ అమానుష ఘటనపై భయభ్రాంతులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నిక ల్లో కర్షకులు వైసీపీని భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డిపై ఒంగోలులో హత్యాయత్నం ప్రయత్నం చేయడం దారుణమని తెలుగు రైతు పార్లమెంటరీ అధ్యక్షుడు గోపినాధ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ

శ్రీకాళహస్తి ఫిబ్రవరి 20: రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక మంగళవారం శ్రీకాళహస్తి పట్టణంలో జరిగింది. ఇందులో భాగంగా గౌరవాధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచు రెడ్డి, మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి, అధ్యక్షులుగా భాగ్యలక్ష్మి చెంచు రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సునీల్ కుమార్ రెడ్డి, కోశాధికారిగా ముని రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మహేంద్ర రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గోపాల్ రెడ్డి, కార్యదర్శిగా గిరిధర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా శ్రీనివాస్ రెడ్డిని ఎన్నుకున్నారు. అలాగే సభ్యులుగా సుబ్రహ్మణ్యం రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, మురళి రెడ్డి, భాస్కర్ రెడ్డి, తదితరులు ఎన్నుకున్నారు.

ఆటో బోల్తా..ఆరుగురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

తొట్టంబేడు, ఫిబ్రవరి 20: ఆటో బోల్తా పడి ఆరుగురు గాయపడిన సంఘటన శ్రీకాళహస్తి మండలంలోని వెడెం సమీపంలోని భైరవకోన వద్ద సోమవారం రాత్రి చోటుచేకుంది. క్షతగాత్రుల కథనం మేరకు.. నాయుడుపేట తిమ్మాజీకండ్రిగ గ్రామానికి చెందిన మేకా పుష్పలత, మునిలక్ష్మి, హరిక్రిష్ణ, సావిత్రి, సుధ, చిత్ర వారి స్వగ్రామం నుంచి శ్రీకాళహస్తికి దైవదర్శనానికి వచ్చారు. ముక్కంటి దర్శనానంతరం వెడెం సమీపంలోని భైరవకోన వెళ్లి ఇంటింటికి తిరిగి బయలు దేరారు. రాత్రి కావడంతో కోన నుంచి కిందకు దిగుతున్న సమయంలో ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న వారు పడిపోయారు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న 108సిబ్బంది వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.